





'సోమశిల'కు 3,300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 3,300 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 71.791 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1,550, కండలేరుకు 800, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువ 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



గత వైసీపీ పాలనలో కనిపించని అభివృద్ధిని అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే ఎన్డీఏ కూటమి చేసి చూపించింది. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసి అన్ని రంగాల్లో అభివృద్ధికి బాటలు వేస్తోంది. ప్రతి పేద కుటుంబం గౌరవ ప్రదమైన జీవనం గడపడం, గ్రామీణ పేదలు తమ సామాజిక ఆర్థిక అవసరాలను తీర్చుకోవడానికి అవసరమైన వనరులను సమకూర్చడానికి కృషి చేస్తోంది. ప్రతి పేద మహిళ లక్షాధికారి కావాలన్న సంకల్పంతో వారి అభివృద్ధికి అనేక పథకాలను రూపకల్పన చేస్తూ పేదరికంపై గెలుపు సాధించాలనే లక్ష్యంతో ముందడుగు వేస్తోంది.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

మహా వైభోగం

- కూటమి ప్రభుత్వంలో 'సంక్షేమ' పరుగులు
- అన్ని వర్గాల్లో ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు

ఎస్‌ఆర్ శంకరన్ నాలెడ్జి సెంటర్లు



బీసీ సంక్షేమ శాఖపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. జిల్లాలో ఈ శాఖ పరిధిలోని వసతి గృహాల్లో ప్రత్యేకంగా ఎస్‌ఆర్ శంకరన్ నాలెడ్జ్ సెంటర్ల ఏర్పాటుకు రూ.4.45 కోట్లు విడుదల చేసింది. విద్యార్థులకు డిజిటల్ బోధన చేయడానికి పొదలకూరులోని బాలికల వసతి గృహ ప్రాంగణంలో, మహ్మదాపురంలోని బాలుర వసతి గృహ ప్రాంగణంలో, ఆత్మకూరులోని బాలికల, కావలిలోని బాలుర వసతి గృహ ప్రాంగణాలలో ఈ సెంటర్లను ఏర్పాటు చేశారు. డిజిటల్ బోధనకు పెద్ద స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. జనరల్ నాలెడ్జ్‌కు, ఇతర ప్రయోజనకర అంశాలపై ఈ కేంద్రంలో బోధన చేయనున్నారు.




పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు

గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లు పేదల ఆకలి తీర్చాయి. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం వాటిని మూసేసింది. దీంతో పట్టణ ప్రాంతాలకు పనుల కోసం వచ్చే ఎందరో పేదలు పొట్టకూటి కోసం ఇబ్బందులు పడ్డారు. తిరిగి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆగస్టులో అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించింది. నెల్లూరులో 9, కందుకూరు, కావలి, ఆత్మకూరు తదితర ప్రాంతాలలోని అన్న క్యాంటీన్లలో రూ.5లకే కడుపు నింపుతున్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెడుతున్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

గత ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన మధ్యాహ్నభోజనం ఇంటర్ విద్యార్థులకు మళ్లీ అందిచాలని నిర్ణయించారు. దీంతో జిల్లాలోని 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 6074 మంది విద్యార్థులకు మేలు జరగనుంది.

పాడి రైతుకు బాసట



పేదరైతు కుటుంబాల ఉపాధిగా ఉన్న పాడి మీద కూడా జగన్ ప్రభుత్వం పగబట్టింది. కనీస ప్రోత్సాహకాలు లేకుండా చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పాడియావులను సంరక్షించుకునేందుకు గోకులాల పేరిట షెడ్లు నిర్మించి ఇస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 1300 గోకులాలను నిర్మిస్తోంది.

బ్యాంకు లింకేజీ రుణాలు

పొదుపు సంఘాలలోని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనే ఉద్దేశంతో ఆర్థిక భరోసాను కల్పించి తద్వారా పరపతిని పెంచాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. బ్యాంకుల ద్వారా రుణ సాయాన్ని ప్రతి మహిళ రూ.లక్ష నుంచి 2 లక్షల వరకు తీసుకునే వెసులు బాటు కల్పించి ప్రోత్సహిస్తోంది. 25,732 డ్వాక్రా గ్రూపులకు రూ.1,277.13 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను ఇవ్వాలని డీఆర్‌డీఏకు లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇప్పటివరకు 10522 గ్రూపులకు రూ.838.88 కోట్ల రుణాలు అందచేసింది. అదేవిధంగా శ్రీనిధి ద్వారా 17,688 గ్రూపులకు రూ.118.06 కోట్ల రుణాలు మంజూరు చేసింది.



ఒకటో తేదీనే జీతాలు, పెన్షన్లు

ప్రభుత్వ ఉద్యోగులు జీతాల కోసం, మాజీ ఉద్యోగులు పెన్షన్ల కోసం రోజుల తరబడి ఎదు రుచూసే పరిస్థితి జగన్ ప్రభుత్వంలో ఉండేది. కూటమి ప్రభుత్వం ఈ నాన్చుడు ధోరణికి స్వస్తి చెప్పింది. ఇప్పుడు ఒకటో తేదీనే జిల్లాలోని సుమారు 32వేల మంది ప్రభుత్వ రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు అందుతున్నాయి. 20వేల మంది రిటైర్డు ఉద్యోగుల కుటుంబాలూ ధీమాగా పెన్షన్లు అందుకుంటున్నాయి.



అవ్వాతాతల్లో ఆనందం




సామాజిక పింఛన్‌ను రూ.3వేలు ఇస్తామంటూ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చాక జగన్ మడమ తిప్పేశారు. కేవలం ఏడాదికి పింఛన్‌ను రూ.250 మాత్రమే పెంచింది. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.3వేలు ఉన్న పింఛన్‌ను రూ.4వేలకు పెంచింది. దివ్యాంగులకు, దీర్ఘకాలిక రోగులకు అందించే రూ.3వేల పింఛన్‌ను రెండింతలు చేసి రూ.6వేలకు పెంచింది. జిల్లాలో మొత్తం సామాజిక పెన్షన్‌దారులు 3,10,029 మంది ఉండగా, ప్రతినెలా 131.63 కోట్ల పెన్షన్ మొత్తాన్ని అందజేస్తోంది. వీటిలో వృద్ధాప్య పింఛన్లు 1,65,356, వితంతు పెన్షన్లు 73726, దివ్యాంగ పెన్షన్లు 32,773 ఉన్నాయి.

సంక్షేమ హాస్టళ్లకు నిధులు

వైసీపీ ప్రభుత్వంలో నిధులు సక్రమంగా విడుదల చేయకపోవటంతో సంక్షేమ వసతి గృహాల్లో అంధకారం అలముకుంది. ఎన్నో భవనాల్లో పైకప్పు, పెచ్చులూడి పైన పడుతున్నా, శిథిలావస్థకు చేరినా, డ్రైనేజీ వ్యవస్థ దుర్భరంగా ఉన్నా పట్టించుకోలేదు. ఇన్ని అవస్థలపై అధికారులు మొరపెట్టుకున్నా గత పాలకులు పెడచెవిన పెట్టారు. దీంతో వసతి గృహాల్లో చదువుతున్న పేదింటి విద్యార్థులు అక్కడ ఉండలేక నానా ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వసతి గృహాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. జిల్లాస్థాయి నుంచి నివేదికలు తెప్పించుకుని నిధుల విడుదలకు పూనుకుంది. జిల్లాలోని 64 సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో అభివృద్ధి పనులకు రూ.9 కోట్లు మంజూరు చేసింది. పంచాయితీరాజ్ ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యుఎస్‌ల ఆధ్వర్యంలో పనులు మొదలు పెట్టనుంది.

వంటింట్లో దీపం-2


ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరిన కొద్ది రోజులకే రేషన్‌కార్డుదారులకు దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ పంపిణీ చేసింది. సూపర్ సిక్స్ హామీలలో భాగంగా దీపం పథకం-2 కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయడానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో నవంబరు నెల ఒకటవ తేదీ నుంచి సిలిండర్లను పంపిణీ చేస్తున్నారు. 7.33 లక్షల రేషన్ కార్డుదారులు ఉండగా, వీరిలో 4.9 లక్షల మంది దీపం-2 పథకానికి అర్హులుగా తేల్చారు. వీరిలో 4.8 లక్షల మందికి సిలిండర్లు అందజేయగా, సుమారు రూ.40.32 కోట్లు బ్యాంకు ఖాతాలో జమచేశారు.



కన్నతండ్రినే కడతేర్చాడు!

- గొడ్డలితో నరికి చంపిన కుమారుడు

కొడవలూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రెక్కలు ముక్కలు చేసుకుని పెంచి పెద్ద చేసిన కొడుకే ఆయన పాలిట యముడిలా మారాడు. తాగుడుకు బానిస అయినందుకు మందలించడమే ఆ తండ్రి చేసిన పాపం. కోపోద్రిక్తుడైన కుమారుడు గొడ్డలితో విచక్షణారహితంగా నరికి చంపాడు. కొడవలూరు మండలం యల్లాయపాలెం తెల్లమిట్ట గిరిజన కాలనీలో శనివారం జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు.. యల్లాయపాలెం గ్రామానికి చెందిన పొట్లూరు పోలయ్యకు (55) ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. రెక్కాడితేగాని డొక్కాడని పోలయ్య రోజువారి పనులు చేసి వచ్చే సంపాదనతో బిడ్డలను పెంచి, పెద్దచేశాడు. ముగ్గురికి పెళ్లిళ్లు చేశాడు. అయితే, రెండో కుమారుడు పొట్లూరి సుబ్రహ్మణ్యం గ్రామంలో జులాయిగా తిరిగేవాడు. భర్తతో విభేదాల కారణంగా భార్య దూరంగా ఉండటంతో మద్యానికి బానిస అయ్యాడు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో ఇంట్లో ఉన్న పోలయ్య తన కుమారుడు సుబ్రహ్మణ్యంను బాధ్యత లేకుండా తాగుతున్నావంటూ నిలదీశాడు. దీంతో వారి మధ్య మాటమాట పెరిగి ఘర్షణ చోటుచేసుకుంది. కోపోద్రిక్తుడైన సుబ్రహ్మణ్యం ఇంట్లో ఉన్న గొడ్డలిని తీసుకొని పోలయ్య తలమీద, చాతిమీద నరికాడు. దీంతో పోలయ్య బిగ్గరగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చే సరికి సుబ్రహ్మణ్యం పరారయ్యాడు. అప్పటికే తీవ్రంగా గాయపడిన పోలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ సురేంద్రబాబు, ఎస్ఐ కోటిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గ్రామస్థులను అడిగి వివరాలు సేకరించి, కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిందితుడిని త్వరగా పట్టుకుంటామని చెప్పారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



పోలయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సురేంద్రబాబు





ఇంటికి అందం.. మొక్కతో బంధం!

- నగరంలో వెలుస్తున్న నర్సరీలు
- దేశీయంతోపాటు విదేశీ మొక్కలూ విక్రయాలు
- రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ

ప్రకృతి ప్రియులకు పచ్చని మొక్కలు అంటే మహా ఇష్టం. అవి ఎక్కడున్నా సరే పరుగులుతీసి మరీ ఇంటికి తెచ్చుకుంటారు. అలాంటిది నెల్లూరు నగరంలో భవిష్యత్తుకు ప్రాణవాయువు లాంటి అందమైన పూల, పండ్ల, మొక్కలు అందుబాటులో ఉంటే ఇక వారిని ఆపేదెవరు?. ట్రంకురోడ్డు, మినీబైపాస్ రోడ్డు, కృష్ణపట్నం పోర్టు రోడ్డు, జొన్నవాడ రోడ్డు ఇలా నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులకు ఇరువైపులా నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలను విక్రయిస్తున్నారు. ఎన్ని రూ.కోట్లు ఖర్చు చేసి ఇల్లు కట్టుకున్నా ఇంటిముందు అందమైన మొక్కలు ఉంటే ఆ ఇంటికే అందాన్ని ఇస్తుంది. అలాంటి మొక్కలు వందల రకాలు నగరంలో లభ్యమవుతుండగా, రూ.50 నుంచి రూ.లక్ష వరకు ధర పలుకుతున్నాయి.

- వివరాలు 6లో..





భక్తజనం నడుమ ముందుకు సాగుతున్న రథం, రథంపై కొలువుదీరిన ఉత్సవర్లు

హరేరామ.. హరేకృష్ణ..!

- కావలిలో వేడుకగా జగన్నాథుడి రథయాత్ర
- అడుగడుగునా భక్తుల నీరాజనం

'హరేరామ.. హరేకృష్ణ... కృష్ణ కృష్ణ హరే హరే' అంటూ భక్తుల నామస్మరణలతో కావలి పట్టణం మారుమోగిపోయింది. శనివారం సాయంత్రం అశేష భక్తజనం నడుమ జగన్నాథుడి రథయాత్ర వేడుకగా సాగింది. నెల్లూరులోని ఇస్కాన్ మందిర అధ్యక్షుడు సుఖదేవ్ మహరాజ్ పర్యవేక్షణలో జరిగిన వేడులను ఎమ్మెల్యే కృష్ణారెడ్డి జెండా ఊపి రథాన్ని ముందుకు కదలించారు.

- వివరాలు 6లో..



ఆగ్రహం

విడవలూరులో ఆందోళన చేస్తున్న ఎమ్పీడీవో, ఉద్యోగులు

అన్నమయ్య జిల్లా గాలివీడు ఎమ్పీడీవో జవహర్‌బాబుపై వైసీపీ మూకల దాడిని నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా రెవెన్యూ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయాల వద్ద అధికారులు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఎమ్పీడీవోపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మంచు దుప్పటిలో సంగం

సంగం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం తెల్లవారు జామున మంచు దట్టంగా ఏర్పడింది. ఈ మంచు వల్ల రహదారి కనిపించక వాహనాలు లైట్లు వేసుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం 8 గంటలైనా మంచు తగ్గలేదు. సంగంపై దుప్పటి కప్పినట్లు మంచు వ్యాపించింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



మాలకొండ ఆదాయం రూ. 9,05,080

వలేటివారిపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి శనివారం భక్తుల నుంచి రూ.9లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.వి సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్, కుంకుమార్చన, వివాహాలు, తలనీలాలు, వాహనపూజ, ప్రత్యేకదర్శనం, స్థలపురాణ పుస్తకాలు విక్రయాలు ఇతర మార్గాలతో ఆదాయం వచ్చిందని సాగర్‌బాబు పేర్కొన్నారు.



నగరంలో వెలుస్తున్న నర్సరీలు

దేశీయంతోపాటు విదేశీ మొక్కలూ విక్రయాలు

రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ

ఇంటికి అందం..
మొక్కతో బంధం!

నెల్లూరురూరల్, (ఆంధ్రజ్యోతి) : రూ.కోట్లు పెట్టి ఇల్లు కట్టుకున్నా.. రూ.లక్షలు పెట్టి ఇంటీరియల్ చేయించుకున్నా.. రూ.వేలు వెచ్చించి ద్వారాలు పెట్టుకున్నా ఏదో వెలితి గానే ఉంటుంది. అదే పచ్చని మొక్కలు ఉంచితే చాలు ఆ ఇంటికే అందాన్ని తెచ్చి పెడుతుంది. ఈ పద్ధతినే పాటిస్తున్నారు మన నెల్లూరీయులు. వారికున్నది పూరి గుడిసె అయినా.. ప్యాలెస్ అయినా సరే ఇంటి ముందు ఖచ్చితంగా శోభనిచ్చే మొక్కలు ఉండాల్సిందే. కాస్తంతా ఖాళీ స్థలముంటే పండ్ల మొక్కలు అందులో వేయాల్సిందే. ఇలా ప్రకృతిప్రియులను మొక్కలు ఆకర్షిస్తుండటంతో వాటి అమ్మకాలకు గిరాకీ పెరిగింది. గతంలో మొక్క కావాలంటే నెల్లూరులో వెతుక్కుంటూ వెళ్లాల్సిన దుస్థితి ఉండేది. లేదా తెలిసిన వారింట్లో అడిగి తెచ్చుకునేవారు. ఇప్పుడు పూర్తిగా భిన్నమైన వాతావరణం ఏర్పడింది. నగరంలో ఎటు చేసినా మొక్కల నర్సరీలే దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా మినీబైపాస్ రోడ్డు, ముత్తుకూరు రహదారి, మైపాడు రోడ్డు, జీఎన్‌టీ రోడ్డు, పొదలకూరు రోడ్డు ప్రాంతాలలో అనేక రకాల మొక్కలు ఆకర్షిస్తున్నాయి. రూ.20 నుంచి మొదలు రూ.వేలలో అందమైన అరుదైన మొక్కలు ఈ నర్సరీల్లో లభ్యమవుతున్నాయి. మన పూర్వీకుల నుంచి ఈ మొక్క ల సంతతి తెలిసిందే అయినా హైబ్రీడ్ రకాలతో వివిధ ఆకర్షణీ యమైన పూలతో కొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయి. ఇండోర్, అవుట్‌డోర్, టేబుల్ మొక్కలంటూ అనేక రకాలు మార్కెట్లోకి వచ్చాయి.

దేశ, విదేశాల నుంచి దిగుమతి

తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి వివిధ రకాల మొక్కలను వ్యాపారులు దిగుమతి చేసుకుని నగరంలో విక్రయిస్తున్నారు. కానీ నెల్లూరు - జొన్న వాడ రహదారి పొట్టేపాళెం కలుజుదాటాక గార్డెన్ వరల్డ్‌లో 1500 రకాల మొక్కల ప్రపంచమే ఉంది.

ఎన్ని రకాల ఇండోర్ మొక్కలో..





మొక్కను ఇలా అందంగా మలిచి...

మనుబోలు మండలం వీరంపల్లికి చెందిన జెట్టి నవీన్‌రెడ్డి ప్రపంచ వ్యాప్తంగా అరుదైన మొక్కలను దిగుమతి చేసుకుని ప్రకృతిప్రియులకు అందుబాటు ఉంచారు. రూ.50 నుంచి రూ.లక్ష వరకు ఇక్కడ వివిధ రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా డార్జిలింగ్ ఆరంజ్, బోన్ సాయి, పచ్చిరా, చైనాడాల్, యాంథోరియం, ఆగ్లోనిమా, క్యాక్టర్స్, సక్యూలెన్స్, పీస్‌లిల్లీ వంటి విదేశీ సంతతికి చెందిన మొక్కలను చైనా, థాయిలాండ్, వియాత్నం, మన దేశంలోని గుజరాత్, ఢిల్లీ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. ఇంటికే కాకుండా కార్యాలయాలు, వాణిజ్య సముదాయాల్లో ఉంచే బోన్‌సాయి మొక్కలు ఇక్కడ ప్రత్యేకం.





అరె.. భలే ఉన్నాయ్!



పండ్ల మొక్కల్లోనూ రకాలు

మనం తరచూ చూసే మామిడి మొక్కల్లో ఒకటీ రెండు రకాలు మాత్రమే తెలుసు. కానీ నర్సరీల్లో అనేక హైబ్రీడ్‌కు చెందిన 30 రకాలు ఉన్నాయి. ఇక జామ 6, సపోట 4, కొబ్బరి 6 హైబ్రీడ్ రకాలను కొనుగోలు దారులకు అందుబాటులో ఉంచారు. ఇవి రూ.50 నుంచి ఐదు వేల వరకు వివిధ సైజులు, రకాల్లో ఉన్నాయి. కొన్ని నర్సరీల నిర్వాహకులు దేశీయ మొక్కలకు జీవం పోస్తుండగా, విదేశీ సంతతికి చెందిన మొక్కలను మాత్రం ప్రత్యేకించి దిగుమతి చేయించుకుంటున్నారు. ఇవీ పూర్తిగా అవుట్‌డోర్ మొక్కలు కావడంతో ప్రతికూల వాతావర ణాన్ని తట్టుకునే విధంగా వీటి తయారీ ఉందని నర్సరీదారులు చెబుతున్నారు.



ఎన్ని రకాల మొక్కలో..

● లక్ష మొక్కలే లక్ష్యంగా..

మనం బతకడానికి వ్యాపారం చేయాలి.. పదిమందిని బతికం చడానికి ప్రజాసేవ చేయాలి. ఇదే ఆచరిస్తున్నారు గార్డెన్ వరల్డ్ అధినేత జెట్టి నవీన్‌రెడ్డి. లక్ష మొక్కలు ప్రకృతి ఒడిలోకి చేర్చాలన్న లక్ష్యంతో ప్రతి వారం అనేక సంస్థలకు వెయ్యి మొక్కలను అందిస్తున్నారు. పండ్లు, నీడనిచ్చే మొక్కలను అందచేస్తున్నారు. ఎవరైనా సరే తనను సంప్రదిస్తే ఈ తరహా మొక్కలను ఉచితంగా ఇస్తానని చెబుతున్నారు. ప్రభుత్వ సంస్థలతో భాగస్వామ్యమై పాఠశాలలు, కార్యాలయాలు, రోడ్లు, కూడళ్లు వంటి ప్రాంతాలలో మొక్కలు అందచేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

మొక్కలంటే బాగా ఇష్టం

మాకు మొక్కలంటే బాగా ఇష్టం. ఇష్టమైన మొక్కలను నర్సరీలో కొనుగోలు చేసి ఇంట్లో పెంచుకుంటాము. ఎప్పుడూ చూడని మొక్కలు, అరుదైనవి ఇక్కడ దొరుకుతున్నాయి. ధర కూడా అందుబాలులోనే ఉన్నాయి.



- డీ క్రిష్ణారావు, వై మోహన్, కొండ్లపూడి సంఘం

మొక్కలు పెంచుకుంటే అదోతృప్తి

మొక్కలను ఇంట్లో పెంచుకుంటే అదొకతృప్తి. వీటిని చూడగానే మనసుకు హాయిగా ఉంటుంది. మొక్కలను పెంచడం మా పెద్దవాళ్ల నుంచి అలవాటు అయ్యింది. ప్రతి రోజూ వాటిని చూసుకుంటూ సంరక్షించుకుంటూ ఉండటమంటే మాటల్లో చెప్పలేము.



- జీ శ్రావణ్‌కుమార్, కవిత, బీవీనగర్ నెల్లూరు



పాము కాదు.. ఇది మొక్కే!



మొక్కలే కాదండోయ్.. కుండీలూ అందంగా ఉంటాయ్!



అవుట్‌డోర్ మొక్కలు..



ఇది డార్జిలింగ్ ఆరెంజ్

అన్ని రకాల మొక్కలున్నాయ్!

మాది వ్యవసాయ కుటుంబం కావడం ఈ నర్సరీ ఏర్పాటుకు ప్రధాన కారణమైంది. నిమ్మ మొక్కలేసి చెట్లుగా పెంచేవాడిని. అలా అలవాటై ఇప్పుడు ప్రకృతిప్రియులకు అవసరమైన అన్ని రకాల మొక్కలను అందుబాటులో ఉంచాము. మన దేశ సంతతితోపాటు విదేశీ మొక్కలనూ తెప్పించి, అమ్ముతున్నాము. వ్యాపారంకాక లక్ష మొక్కలు నాటాలన్నదే నా లక్ష్యం కూడా.



- జెట్టి నవీన్‌రెడ్డి, గార్డెన్ వరల్డ్స్ అధినేత

పొదుపు మహిళలను పారిశ్రామిక వేత్తలు చేయండి : మెప్మా పీడీ



శిక్షణలో మాట్లాడుతున్న రాధమ్మ

నెల్లూరు (హరనాథపురం); డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పొదుపు మహిళలకు తగిన అవగాహన కల్పించి పారిశ్రామిక వేత్తలుగా చేయాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఏ. రాధమ్మ ఆర్పీలను ఆదేశించారు. నెల్లూరులోని కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఆర్పీలకు మెప్మా ఆధ్వర్యంలో 100 రోజుల కార్యక్రమాలపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదుపు మహిళలు అన్నీ రంగాలలో రాణిస్తున్నారని తెలిపారు. పరిశ్రమల స్థాపనకు సంబంధించి వారికి సరైన అవగాహన కల్పిస్తే వారు పారిశ్రామిక వేత్తలుగా మారుతారన్నారు. కార్పొరేషన్ అదనపు కమిషనర్ నందన్ మాట్లాడుతూ మెప్మా 100 రోజుల కార్యక్రమాలను విజయవంతం చేయడానికి, అర్పీలు అన్నీ విషయాలను అవగాహన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఈలు అంకయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంకును లాభాల్లో నడుపుతాం

● చైర్మన్ అరిగెల నాగేంద్రసాయి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : అర్బన్ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించటం ద్వారా లాభాల బాటలో నడుపుతామని ఆ బ్యాంకు చైర్మన్ అరిగెల నాగేంద్రసాయి చెప్పారు. నగరంలోని ఆ బ్యాంకు సమావేశ మందిరంలో శనివారం 109వ మహాజనసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా బంగారు రుణాలతో పాటు, డిపాజిట్లపై అధికశాతం వడ్డీ ఇస్తున్నామని చెప్పారు. గృహరుణాలు కూడా అందచేస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో ఆ బ్యాంకు సీఈవో మాగుంట అనిత తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులం షెడ్లు ప్రారంభం



షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా పలుకూరు, జిల్లెలమూడి రైతులు కొండూరి సుస్మిత, షేక్ మస్తానమ్మ నిర్మించుకున్న నూతన మినీ గోకులం షెడ్లను శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ముందుగా ఆయన పలుకూరులో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గత వైసీపీ ప్రభుత్వం గోకులం షెడ్లని పూర్తిగా విస్మరించిందని పాడిరైతుల అభివృద్ధి, సన్నకారు రైతుల ప్రోత్సాహకం కోసం కూటమి ప్రభుత్వం ఈ చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గానికి మొదటి దశలో 89మినీ గోకులం షెడ్లు వచ్చా యన్నారు. గొర్రెలు, మేకలు పెంపకందా రులకు 90శాతం సబ్సిడీ, కోళ్ల పెంపకందారులకు 70శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రత్నజ్యోతి, డ్వామా ఏపీడీ బాబూరావు, టీడీపీ మండలాధ్యక్షుడు నార్నె రోశయ్య, బొద్దులూరి కొండలరావు, యడ్లపల్లి వెంకట నరసింహ్మా, బోయపాటి రమేష్, బెజవాడ శ్రీను, రావెళ్ల వెంకటేశ్వర్లు, ముప్పాళ్ల శ్రీనివాసులు, ఈదర సుధాకర్ పాల్గొన్నారు.

ఎస్సీ జాబితాపై అభ్యంతరాలు తెలపండి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) ! కులగణపలో సేకరించిన ఎస్సీల వివరాల జాబితాను గ్రామ, వార్డు సచివాలయాల నోటీసు బోర్డుల్లో ఉంచామని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోషల్ ఆడిట్ కోసం ఈ జాబితాను ఉంచామని తెలిపారు. ఈ జాబితాపై అభ్యంతరాలను ఈనెల 31వతేదీలోగా స్వీకరిస్తారని తెలిపారు.

నీ కోసం కాదు.. కుటుంబం కోసం హెల్మెట్ వాడు..

ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసే వారు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని, అనుకోని ప్రమాదం జరిగినా తలకు ఎలాంటి గాయాలు కాకుండా అది కాపాడుతుందని కావలి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. హెల్మెట్ల అవసరాన్ని తెలియచేస్తూ శనివారం కావలిలో పోలీసులు, సిబ్బంది తో స్థానిక డీఎస్పీ కార్యాలయం నుంచి హెల్మెట్లు ధరించి ట్రంకు రోడ్డులో మోటారు సైకిళ్లపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మన మీద ఎన్నో ఆశలతో పెట్టుకున్న కుటుంబాలు ఉన్నాయన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఒకటో, రెండో పట్టణ సీఐలు ఫిరోజ్, గిరిబాబు, కావలి సర్కిల్ సీఐ పాపారావు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

- కావలి, (ఆంధ్రజ్యోతి)



హెల్మెట్లు ధరించి ర్యాలీలో పాల్గొన్న పోలీసులు

జగన్నాథ రథయాత్రతో ఆధ్యాత్మిక శోభ

● అడుగడుగునా భక్తుల నీరాజనం

కావలి టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం నిర్వహించిన జగన్నాథ రథయాత్రతో ఆధ్యాత్మికశోభ సంతరించుకుంది. నెల్లూరు ఇస్కాన్ మందిర అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవ్ మహరాజ్ పర్యవేక్షణలో జరిగిన వేడులను ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు ట్రంకు రోడ్డు ఆర్ఎస్ఆర్ మండపం వద్ద ఏర్పాటు చేసిన వేదికలో వారు ప్రముఖులు ఆధ్యాత్మిక ప్రవచనాలు అందించారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ కృష్ణభగవానుడు సర్వమానవాళి సంస్కరణ కొరకు శాంతి సన్మార్గం, ధర్మ శ్లోకాలు, సూక్తులు ఆచరణీయం అన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల, మహిళల కోలాటాలు, వివిధ బృందాలు వేషాధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్, పలు స్వచ్ఛంద సంస్థలు, విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఈ యాత్రలో సేవలందించారు. డీఎస్పీ శ్రీధర్ పర్యవేక్షణలో సిబ్బంది బందోబస్త్‌ను పర్యవేక్షించారు. రథయాత్ర నిర్వాహణకు నల్లూరు రవికుమార్, జయచంద్రానాయుడు, రమేష్ నాయుడు, వెంకటసుబ్బయ్య, గోపికృష్ణ, సువర్ణశ్రీను సహకరించారు.



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి



మబ్బుల మాటున చంద్రుడిలా దర్శనమిచ్చిన సూర్యుడు

సూర్యదేవా.. మబ్బుల్లో కానరావా!!

వెన్నెల్లో చంద్రుడి విన్యాసాలు కనువిందుగా ఉంటాయి. గత పది రోజులుగా అల్పపీడనం ప్రభావంతో సూర్యరశ్మి అందడం లేదు. అసలు సూర్యుడే కన్పించడం లేదు. ఈ క్రమంలో శనివారం ఉదయం 10 గంటల సమయంలో ఆకాశంలో సూర్యుడు ప్రత్యక్షమయ్యాడు. ఓహ్... సూర్యుడు వచ్చేశాడని సంబరపడే లోగా సూర్యప్రతాపం కాస్త కనుమరుగై చంద్రుడిలా మబ్బుల మాటున దాగాడు. మారిన వాతావరణంతో పట్టపగలు ప్రత్యక్షమైంది సూర్యుడా... చంద్రుడా అని చర్చించుకున్నారు. గత పది రోజుల మాదిరిగానే రోజంతా సూర్యుడు మబ్బుల మాటున నక్కేశాడు.

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)

ఎర్రమట్టేసి.. ఎటూ కాకుండా చేసి!



కలువాయి మండలం వెంకటరెడ్డిపల్లి సమీపంలో సోమశిల-పొదల కూరు మెయిన్ రోడ్డు అధ్వానంగా తయారై ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కుల్లూరు చెరువు అలుగు నీటికి తోడు, వర్షాలకు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అధిక లోడ్‌తో ఈ మార్గంలో వెళ్తున్న భారీ వాహనాలు ఈ గుంతల్లో దిగబడిపోయి రోజులు తరబడి అక్కడే ఉన్న సందర్భాలు ఉన్నాయి. దీంతో స్పందించిన రోడ్లు భవనాల శాఖ అధికారులు దెబ్బతిన్న రోడ్డుపై ఎర్రమట్టి వేశారు. ఇది వర్షాలకు బురద బురదగా తయారై అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ఈరోడ్డుపై నుంచి పొలాలకు వెళ్లేవారు, ద్విచక్ర వాహనదారులు బురదతో అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా శాశ్వతంగా రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

- కలువాయి, (ఆంధ్రజ్యోతి)



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

ఉదయగిరి అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తా

● జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

ఉదయగిరి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ఉదయగిరి మండల అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తానని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంపీపీ మూలె పద్మజ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉదయగిరి మండలంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.41 లక్షలతో 9 పనులు, సాధారణ నిధులు రూ.64.20 లక్షలతో 25 పనులు మంజూరు చేశామన్నారు. తొలుత సమావేశంలో అధికారులు వారి వారి శాఖల ప్రగతిని వివరించారు. మండలంలోని గండిపాళెం గ్రామంలో పంచాయతీ ఇచ్చిన తీర్మానం ప్రకారం పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన పీఆర్ ఏఈ శ్రీనివాసరాజుపై మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉండేవని, ప్రస్తుతం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు ప్రజాప్రతినిధులు సభలో వాపోయారు. ఎరువుల దుకాణాల్లో అధిక ధరకు యూరియాను వ్యాపారస్తులు విక్రయిస్తున్నారని తెలిపారు. మండలంలోని పలు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆమెను పలువురు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మోడి రామాంజనేయులు, వైస్ ఎంపీపీ మట్ల శాంతి, ఎంపీడీవో అప్పాజీ, మాజీ సొసైటీ అధ్యక్షుడు మూలె వినయ్‌రెడ్డి, పలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

● ఎస్పీ కృష్ణకాంత్



పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

చేజర్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌ను శనివారం జిల్లా ఎస్పీ జి కృష్ణకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలోని మ్యాప్, క్రైమ్ చార్ట్, కేసుల రికార్డులను పరిశీలించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అను మానాస్పద మరణాలు, మిస్సింగ్ కేసులలో సత్వరమే స్పందించాల న్నారు. నమోదు అయిన కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు. పాఠ శాలలు, కళాశాలల్లోని విద్యార్థులతో పాటు గ్రామాల్లో ప్రజలకు సైబర్ నేరాలపై అవ గాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ వేమారెడ్డి, ఎస్ఐ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల దాడితో వ్యభిచారం గుట్టురట్టు

● అద్దె గదుల నిర్వాహకులపై కేసు నమోదు

వెంకటాచలం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరులో శనివారం పోలీసులు నిర్వహించిన దాడుల్లో అద్దె గదుల్లో నిర్వహిస్తున్న వ్యభిచారం గుట్టు రట్టయింది. వివరాల మేరకు... దక్షిణ భారతదేశంలోనే ప్రత్యేక పేరు ప్రఖ్యాతలున్న పవిత్ర పుణ్యక్షేత్రం కసుమూరు. అలాంటి పుణ్యక్షేత్రాన్ని గత కొన్నేళ్లగా ఆరుగురు వ్యక్తులు ధనార్జనపై వ్యామోహంతో ఇళ్లను అద్దె గదులుగా చేసి వ్యభిచారానికి నిలయంగా మార్చేశారు. దీనిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఇటీవల సీఐ సుబ్బారావు పలుమార్లు అద్దె గృహాల నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కానీ వారిలో ఎలాంటి మార్పు రాలేదు. ఈ క్రమంలో శనివారం స్థానికులు ఇచ్చిన సమాచారంతో సీఐ తన సిబ్బందితో కలిసి అద్దె గృహాలపై ఆకస్మిక దాడులు చేశారు. ఈ దాడుల్లో షేక్ నౌషాద్‌కు చెందిన అద్దె గదుల్లో రెండు జంటలు, సల్మాకు సంబంధించిన అద్దె గదుల్లో మరో రెండు జంటలు ఉండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ కసుమూరులో వ్యభిచారం వంటి అసాంఘిక కార్యకలాపాలకు గదులు అద్దెకు ఇస్తే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కాగా గత టీడీపీ ప్రభుత్వంలో రెండుసార్లు నౌషాద్‌పై పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు పంపించారు. పవిత్రమైన పుణ్యక్షేత్రాన్ని వ్యభిచార నిర్వహణతో అపవిత్రం చేస్తున్నారని, వ్యభిచారానికి అద్దె గదులు ఇస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి : ఒకరి అరెస్టు

ఏఎస్‌పేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై దాడి చేసి ఒకరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ సైదులు శనివారం తెలిపారు. గుడిపాడు పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసి 15వేల రూపాయలు నగదు, రెండు మోటారుసైకిళ్లు సాధీనం చేసుకోని ఒకరిని అదుపులోకి తీసుకోగా ముగ్గురు పరారీలో ఉన్నారని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్


	కిలో
బాయిలర్ లైవ్	115
లేయర్ లైవ్	100
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	230
లేయర్	170

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7349
వెండి కిలో ధర	రూ. 89,700
వెండి ఒక గ్రాము	రూ.92.70

అల్లీపురంలో వృద్ధురాలి అదృశ్యం



మల్లేశ్వరి (ఫైల్)

నెల్లూరురూరల్ డిసెంబరు 28,(ఆంధ్ర జ్యోతి) : నెల్లూరు రూ రల్ మండల పరిధి లోని అల్లీపురంలో వృద్ధురాలు అదృశ్యమైనట్లు శనివారం రూరల్ సీఐ జీ వేణు తెలిపారు. అల్లీపురంలో నివాసముండే దేనుకొండ మల్లేశ్వరమ్మ (66) ఈనెల 26న ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగిరాలేదని ఆమె కుమారుడు శ్రీనివాసులు ఫిర్యాదు చేశారని చెప్పారు. చుట్టుపక్కల, సమీప ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో ఎంత వెతికినా కనపడకపోవడంతో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 94407 96319 నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

అర్ధాకలితో చదువులు..

● పదోతరగతి విద్యార్థులకు అందని అల్పాహారం

● నిధులు కేటాయించని ప్రభుత్వం

ఉదయగిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం అందక అర్ధాకలితో అలమటిస్తున్నారు. ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా నవంబరు 1వ తేదీ నుంచి ఈ తరగతులను ప్రారంభించారు. ఆమేరకు విద్యార్థులు ఉదయం 8 గంటలకే పాఠశాలకు చేరుకోవాలి. సాయంత్రం 5 గంటల వరకు ఉండాలి. రోజుకు ఒక సబ్జెక్టు ఉపాధ్యాయుడు తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలకు పక్క గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు అంత ఉదయాన్నే ఇళ్లల్లో అల్పాహారం సిద్ధం కాక ఖాళీ కడుపుతో వస్తున్నారు. మధ్యాహ్న భోజనం పెట్టేవరకు ఆకలితో అలమటిస్తున్నారు. సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలో ఉండి, తరువాత వారు ఇంటికి చేరేసరికి రాత్రవుతోంది. దీంతో అర్ధాకలితో చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. పాఠశాలలోనే ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్ ఇస్తే బాగుంటుందని, ఇందుకు ప్రభుత్వంతోపాటు దాతలు అల్పాహారం అందించేందుకు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

మధ్యాహ్న భోజనంతోనే సరిపెట్టుకుంటున్న విద్యార్థులు

ఉదయగిరి మండలం బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులకు పాఠశాలలో విద్యార్థులతో పాటు సమీపంలో నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉన్న జీ.అయ్యవారిపల్లి, దేకూరుపల్లి, కొత్తపల్లి, చెర్లోపల్లి తదితర గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. 8 గంటలకే పాఠశాలకు వారు రావాలంటే నివాసంలో 7 గంటలకే బయలుదేరాలి. మరలా సాయంత్రం నివాసానికి చేరేసరికి 7 గంటలు అవుతోంది. దీంతో ఒక్క మధ్యాహ్న భోజనంతోనే వారు సరిపెట్టుకొని అర్ధాకలితో అలమటిస్తున్నారు.

అయ్యా.. అధికారులు పట్టించుకోలా!?

ఫోన్‌లో ఎమ్మెల్యే కాకర్లకు మహిళ ఫిర్యాదు

వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ

ఉదయగిరి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకొని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన ఓ మహిళ నేరుగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. దీంతో ఆయన స్పందించి సమస్య పరిష్కారమయ్యేలా చేశారు. వరికుంటపాడు మండలం భోగ్యంవారిపల్లికి చెందిన సాకే మౌనిక ఇల్లు నిర్మించుకుంది. ఆరు నెలల క్రితం విద్యుత్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకుంది. అప్పటి నుంచి ఉదయగిరి విద్యుత్ కార్యాలయం చుట్టూ తిరుగుతోంది. శనివారం సైతం ఉదయగిరికి రాగా అధికారులు అందుబాటులో లేరు. దీంతో విసుగు చెందిన మౌనిక ఎమ్మెల్యేకు ఫోన్ చేసింది. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే తన వ్యక్తిగత కార్యదర్శికి ఫోన్ చేసి మౌనిక సమస్యను వివరించారు. ఆయన మౌనికతో మాట్లాడి ఉదయగిరి ఏడీఈ కోటేశ్వరరావుకు కాన్ఫరెన్స్ కాల్ చేశాడు. ఏడీఈకి సమస్య వివరించడంతో సోమవారం ఆమె గ్రామానికి వెళ్లి మీటర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆమె సంతోషంగా అక్కడ నుంచి వెనుతిరిగింది. ఎమ్మెల్యేకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

నాణ్యతా ప్రమాణాల్లో వీఎస్‌యూ అగ్రగామి

● వీసీ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు



వీసీ విజయభాస్కర్‌రావుకి ఐఎస్‌వో సర్టిఫికెట్ అందజేస్తున్న ఐఎస్‌వో బృందం అధిపతి హరగోపాల్

వెంకటాచలం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నాణ్యతా ప్రమాణాలు, విధానాలు, నిర్వహణ పద్ధతులు, మౌలిక వసతుల పరంగా విక్రమ సింహపురి యూనివర్సిటీ అగ్రగామిగా నిలిచిందని వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్ రావు పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూను గత రెండురోజులుగా ఐఎస్‌వో బృందం సందర్శించింది. అన్నీ పరిశీలించిన బృందం అధిపతి కేవీ హరగోపాల్ శనివారం వీసీ విజయభాస్కర్‌రావును కలిసి నిబంధనలకు అనుగుణంగా అన్నీ ఉండడంతో ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను అందజేశారు. వీసీ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటించడంతోనే వీఎస్‌యూకు ఐఎస్‌వో గుర్తింపు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, ఐక్యూఏసీ డైరెక్టర్ అందే ప్రసాద్, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి తదితరులు పాల్గొన్నారు.

నగదు గల్లంతుపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం),డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగదు దోపిడీపై నగరంలోని చిన్నబజారు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు, కామాటివీధికి చెందిన సాయికిరణ్ ఎంటెక్ పూర్తి చేసి అమెరికాలోని టెక్సాస్‌లో ఉంటున్నారు. ఆయనకు బృందావనంలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో వ్యక్తిగత బ్యాంకు ఖాతా ఉంది. ఆ ఖాతా నుంచి ఆయన కొంతకాలంగా ఆర్థిక లావాదేవీలు నిర్వహించడం లేదు. ఇటీవల ఆయనకి డబ్బులు రావడంతో తన ఖాతాలో జమ చేశారు. గత నెల 7న ఆయన ఖాతాలోని రూ. 3,96,817 నగదును గుర్తు తెలియని వ్యక్తులు వేర్వేరు ఖాతాలకు బదిలీ చేశారు. ఈ విషయాన్ని బాధితుడు నగరంలో ఉంటున్న తన తండ్రి రమేష్‌బాబుకు తెలియచేశాడు. అనంతరం ఆయన నేషనల్ సైబర్ క్రైం పోర్టల్‌తోపాటు 1930కి ఫిర్యాదు చేశారు. కుమారుడి బ్యాంకు ఖాతా నుంచి మాయమైన ఘటనపై విచారించి చర్యలు తీసుకోవాలని రమేష్‌బాబు శనివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిలిండర్ పేలి దంపతులకు గాయాలు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వంట చేసేందుకే స్టౌ వెలిగిస్తుండగా సిలిండర్ పేలి వివాహిత మంటల్లో చిక్కుకుంది. గమనించిన భర్త మంటలు ఆర్పి ఆమెను వైద్యశాలకు తరలించారు. ఈ క్రమంలో అతను సైతం గాయాలపడ్డారు. పోలీసుల సమాచారం మేరకు కొత్తూరు సుజాతమ్మ కాలనీకి చెందిన సుధాకర్, కమల దంప తులు. శనివారం వంట చేసేందుకు కమల స్టౌ వెలిగించగా సిలిండర్ పేలి మంటల్లో చిక్కుకుంది. పెద్దగా కేకలు వేయడంతో మరో గదిలో ఉన్న భర్త వచ్చి మంటలను ఆర్పి ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నారాయణ వైద్యశాలకు తరలించారు. ఈ క్రమంలో సుధాకర్‌కి సైతం తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి

● జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

ఉదయగిరి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడతానని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. శనివారం ఆమె పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయ డంతో పాటు జరగనున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మూలె పద్మజ, ఎంఈవో-2 శ్రీనివాసు లు, సొసైటీ మాజీ అధ్యక్షుడు మూలె వినయ్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.5 కోట్లతో తరగతి గదులు నిర్మిస్తా...

● మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి

తమ స్వగ్రామమైన గండిపాళెంలో ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరి కూలే దశలో ఉందని, ప్రభుత్వం అనుమతిస్తే తమ తల్లిదండ్రుల పేర్ల మీద రూ.1.50 కోట్ల సొంత నిధులతో తరగతి గదులు నిర్మించి ఇస్తానని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి శనివారం జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల దుస్థితిని గత ప్రభుత్వంలో సైతం అధికారులకు వివరించినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం తరగతి గదులు పూర్తిగా దెబ్బతినడంతో పాఠశాలను అద్దె భవనంలో నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అనుమ తులు మంజూరు చేస్తే తరగతి గదులు నిర్మిం చేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. స్పందించిన ఆమె ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపడతా మన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య, పలువురు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఆర్టీసీ మెరుగైన సౌకర్యాలు

● ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి ● కొండ బిట్రగుంటకు బస్సు సర్వీసు ప్రారంభం



జెండా ఊపి బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

కావలి, డిసెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): ప్రయాణికులకు ఆర్టీసీ మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని అందులో భాగంగానే హైదరాబాద్, బెంగుళూరు లాంటి మహానగరా లకు ఆధునిక బస్సులు ఏర్పాటు చేస్తామని ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన స్థానిక బస్టాండ్ నుంచి కొండబిట్ర గుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి ప్రత్యేక బస్సును ప్రారంభించి మాట్లాడారు. ఇకపై ప్రతి శనివారం కావలి నుంచి కొండబిట్రగుంటకు బస్సును నడపటంతో పాటు ప్రతి శుక్రవారం సాయంత్రం జొన్నవాడ కామాక్షితాయి సన్నిధికి కూడా బస్సు సర్వీసు నడుపుతామన్నారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, ఆర్టీసీ అధికారులతో సంప్రదించి కావలి నుంచి నగరాలకు స్లీపర్‌కోచ్ బస్సులను నడిపేందుకు ప్రయత్నిస్తామన్నారు. కావలి బస్టాండ్ ఆవరణలో అపరిశుభ్రతపై విచారం వ్యక్తం చేశారు. ఆర్టీసీ, మున్సిపల్ అధికారుల సహకారంతో ఆర్టీసీ ఆవరణలోని మురుగు నీరు నిల్వలపై చర్యలు తీసుకుంటామన్నారు. బస్టాండ్ ముందు ప్రయివేట్ బస్సులు ఆగకుండా పోలీస్, రవాణా శాఖ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. డిపో ఉద్యోగులు, పట్టణ ప్రముఖులు సురేష్‌రెడ్డిని సత్కరించి పలు సమస్యలపై అర్జీలు అందజేశారు. అనంతరం కొండబిట్రగుంట బస్సులో ప్రయాణం చేశారు. అంతకుముందు బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహించి బస్టాండ్‌ల ప్రయాణికులతో, వ్యాపారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. డీఎం కార్యాలయంలో ఆర్టీసీ ఉద్యోగులు, పట్టణ ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిపో మేనేజరు రాపూరు శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజరు (ట్రాఫిక్) కల్పనా రెడ్డి, ఏఈ ఎస్‌కే ఖాజామొహిద్దీన్, ఆఫీస్ మేనేజరు జీ విజయకుమారి, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రవిప్రకాష్, బీజేపీ నేతలు జీ. భరత్‌కుమార్, కమల, బ్రహ్మానందం, సీపీసీ సత్యం, అమరా వెంకటసుబ్బారావు, పల్లపు చిట్టిబాబు, మందా కిరణ్, రంగదామ్, రంగారెడ్డి పాల్గొన్నారు.

పక్కా గృహాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న పీడీ వేణుగోపాల్

ఉదయగిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పక్కాగృహాల లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్ సూచించారు. శనివా రం మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లి గ్రామం వద్ద ఏర్పాటుచేసిన లే అవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి మెటీరియల్ సిద్ధంగా ఉందని, బిల్లు పెట్టిన వారం రోజుల్లోనే నగదు వారి ఖాతాల్లో జమవుతుందన్నారు. కావున లబ్ధిదారులు 2025 మార్చి నాటికి పక్కాగృహ నిర్మాణాలను పూర్తిచేసు కోవాలన్నారు. ఉదయగిరి లేఅవుట్‌లో ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్ 140 పక్కాగృహాల నిర్మాణాలు చేపట్టారన్నారన్నారు. లేఅవుట్‌లలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ పీరా, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు హర్షవర్ధన్‌రెడ్డి, చెన్నరాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు చెరువు అభివృద్ధికి కృషి


ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లును, పాలకవర్గ సభ్యులను సన్మానించిన టీడీపీ నేతలు

ఆత్మకూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఆత్మకూరు చెరువు అభివృద్ధికి కృషిచేస్తామని అందుకు జలవనరుల శాఖ అధికారులు సహకరించాలని సాగునీటి సంఘం నూతన అధ్యక్షుడు మాదాల మస్తాన్‌నాయుడు కోరారు. శనివారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో ఈఈ వెంకటేశ్వర్లును, ఆత్మ కూరు చెరువు సాగునీటి సంఘం పాలకవర్గ సభ్యులను టీడీపీ నేతలు సన్మానించారు. ఈసందర్భంగా వారు ఆత్మకూరు చెరువు నీటిపారుదల, సామర్థ్యం, సాగునీటి కాలువల మరమ్మతులు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. రెండు పంటలకు చివరి ఆయుకట్టు వరకు సాగునీరు అందించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, రూరల్ అధ్యక్షుడు సుంకర పెంచలచౌదరి, ప్రధాన కార్యదర్శి కేతా విజయ భాస్కర్‌రెడ్డి, తెలుగు యువత ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, సొసైటీ మాజీ చైర్మన్ చిట్టమూరు వెంకటేశ్వర్లురెడ్డి, వైస్ చైర్మన్ డేగా పెంచలరెడ్డి, డైరెక్టర్లు చిట్టమూరు వెంకురెడ్డి, నరసింహారెడ్డి, సుమలత పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాలు వేగవంతం చేయాలి


మర్రిపాడు: మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో సభ్యత్వాలు తీసుకున్న నేతలు

కొండాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం సభ్యత్వాలను వేగవంతం చేయాలని మండల మాజీ వైస్ చైర్మన్ పోలినేని చంద్రబాబునాయుడు తెలిపారు. శనివారం ఆయన మండలకేంద్రంలో టీడీపీ నాయకులతో సమావేశమై మాట్లాడారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల నాయకులు ఇప్పటి వరకు 9వేలకు పైగా పార్టీ సభ్యత్వాలు చేసినట్లు తెలిపారు. ఈనెల 30వరకు పార్టీ సభ్యత్వ నమోదుకు అవకాశం ఉందని ఇప్పటికీ నమోదు కాని వారితో చేయించాలని కోరారు. సభ్యత్వ కలిగే ప్రయోజనాలను వివరించాలని నాయకులు, కార్యకర్తలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు సుధాకర్, తిరుపతిరెడ్డి, నరేంద్ర, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● మర్రిపాడు : మండలంలోని 13మంది నాయకులు శనివారం టీడీపీ శాశ్వత సభ్యత్వాలు తీసుకున్నారు. విజయవాడలో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కలిసి ఆయన సమక్షంలో సభ్యత్వాలు తీసుకున్నట్లు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుట్టం బ్రహ్మారెడ్డి తెలిపారు.

సినిమా టిక్కెట్ ధరలు పెంచొద్దు


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మల్లి

కావలి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో కొత్త సినిమాల టిక్కెట్ ధరలు పెంపునకు ప్రభుత్వం ప్రత్యేక జీవోలు ఇవ్వవద్దని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి తెలిపారు. శనివారం ఈ విషయంపై ఆయన సంఘం సభ్యులతో స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఆర్డీవో వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. సినిమా అగ్రహీరోలకు వాళ్ల సినిమాలు రిలీజ్ అయినపుడు కొత్త జీవోలు ఇస్తే వంద రూపాయలు టిక్కెట్‌ను రూ.వెయ్యికి అమ్ముతూ సామాన్య జనాలను దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనార్దన్, హుస్సేన్, వెంకటరత్నం పాల్గొన్నారు.

ఎంపీడీవోపై దాడిని ఖండిస్తూ నిరసన


వలేటివారిపాలెం: నిరసన చేస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

వలేటివారిపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబుపై దాడిని ఖండిస్తూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎంపీడీఓ నరేంద్రదేవ్‌తో పాటు సిబ్బంది నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

●వింజమూరు : అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబుపై దాడి చేయడం పట్ల శని వారం మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● కావలి రూరల్ : అన్నమయ్య జిల్లా గాలివీడు ఎమ్పీడీవో జవహర్‌బాబుపై దాడి చేయడం అమానుషం అని మండల ఎమ్పీడీవో శ్రీదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి కార్యాలయ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్పీడీవో శ్రీదేవి మాట్లాడారు. దాడి చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాల అడ్డగింపు


ప్రభుత్వ స్థలంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణం

కావలి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మానస థియేటర్ సమీప రోడ్డులో అక్రమంగా చేపట్టనున్న అక్రమ నిర్మాణాలను శనివారం మున్సిపల్ సిబ్బంది అడ్డుకున్నారు. ఆర్వోబీ వంతెన నిర్మాణానికి ప్రయివేట్ వ్యక్తుల స్థలాలను గతంలో సేకరించి వారికి పరిహారం చెల్లించారు. ఈ స్థలంలోని కొన్ని భవనాలను కూడా తొలగించారు. అయితే ఆర్వోబీ వంతెన నిర్మాణం జరుగక ఆ స్థలం ఖాళీగా ఉండటంతో గతంలో స్థలం ఇచ్చిన వారు ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు తమ సిబ్బందిని పంపి నిర్మాణాలు నిలిపివేయించారు. అవసరమైతే పార్కింగ్‌కు ఆ స్థలం వాడుకోవచ్చని తాత్కాలిక నిర్మాణం చేపట్టినా సహించమని హెచ్చరించారు.

ఉపాధి కూలీ కుటుంబానికి ఆర్థిక సాయం

కందుకూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీ నలదలపూరు కుంచాల కొండమ్మ కుటుంబసభ్యులకు శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రూ.50వేలు ఆర్థికసాయం అందజేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి ఈ మొత్తాన్ని అందజేసినట్లు ఏపీడీ జె. బాబూరావు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ మహేష్, మన్నం కృష్ణ, మన్నం ఉమామహేశ్వరరావు, కంద్రా శ్రీను, బత్తిన కృష్ణారావు పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు

● ప్రజల అవస్థలు
● పట్టించుకోని అధికారులు


గొల్లపల్లిలో బురదమయంగా మారిన సిమెంటు రోడ్డు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని వరికుంటపాడు మండలంలో సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. ఇతరత్రా వసతుల సంగతి అటుంచితే గ్రామాల రహదారులు అధ్వాన్నంగా మారినా పట్టించుకునే నాథుడే లేడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నానా కష్టాలు అనుభవించిన పల్లె ప్రజలు కూటమి ప్రభుత్వం పల్లె పండుగ పేరుతో సిమెంట్ రోడ్లను మంజూరు చేయడంతో సంబరపడ్డారు. ఇక తమ కష్టాలు తీరినట్లేనని ఆశపడిన ప్రజలు నిరాశకు గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేయడంతో పాటు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల పనులు జోరుగా సాగుతుండడం మంచి పరిణామమే అయినప్పటికీ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల వెంట ప్రయాణం నరకప్రాయంగా మారింది. రోజుల తరబడి కురిసిన వర్షాల పుణ్యమా అని సిమెంట్ రోడ్లతో సహా గుంతల మయంగా మారిన గ్రావెల్ రహదారుల్లో ఎక్కడి నీరు అక్కడే నిలిచి ప్రమాదాలకు నిలయంగా మారాయి. జీ.కొత్తపల్లి, నల్లబోతులవారిపల్లి, యర్రంరెడ్డిపల్లి, గొల్లపల్లి, విరువూరు, సాతువారిపల్లి తదితర గ్రామాల్లో ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయి.

కలగా మిగిలిన రింగురోడ్డు

ఇదంతా ఒకవంతైతే రామాపురం జాతీయ రహదారి నుంచి హుస్సేన్ నగర్ మీదుగా కాకొల్లువారిపల్లి జాతీయ రహదారి వరకు మంజూరైన రింగురోడ్డు నిర్మాణం ఏళ్ల తరబడి ప్రారంభానికి నోచుకోక పోవడం దారుణం. దీంతో ఆయా గ్రామాల ప్రజలు మోకాలి లోతు గుంతల నడుమ బురదమయంగా మారిన గ్రావెల్ రహదారి వెంటే ప్రయాణాలు సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ రహదారికి ఆనుకునే పాఠశాలలు, వసతిగృహం ఉండడంతో ప్రజలతో పాటు ప్రతినిత్యం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు అడుసు తొక్కుకుంటూనే అడుగులు వేయాల్సి వస్తోంది. గతంలో టీడీపీ, వైసీపీ ప్రభుత్వాల హయాంలో రెండుసార్లు టెండర్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ పనులు చేపట్టకపోవడం ఆప్రాంత వాసులకు శాపంగా మారింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో అధ్వానంగా మారిన ప్రధాన రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్థులు కోరుతున్నారు.

నిర్ణీత గడువులో రెవెన్యూ సమస్యల పరిష్కారం



సీతారామపురం:రైతుల వద్ద అర్జీలు తీసుకుంటున్న తహసీల్దార్ కృష్ణారెడ్డి

ఉదయగిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడినరవలో శనివారం తహసీల్దారు సుభద్ర రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసదస్సుల్లో ప్రజలు, రైతులు పలు సమస్యలపై అర్జీలు అందజేశారు. అర్జీలను పరిశీలించి త్వరలో పరిష్కారమార్గం చూపుతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సురేంద్ర, వీఆర్వో రాజేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●దుత్తలూరు : మండలంలోని మండలపల్లి గ్రామంలో శనివారం తహసీల్దారు నాగరాజు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పలు సమస్యలపై ప్రజలు, రైతులు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సంగం : మండలంలోని దువ్వూరులో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు సోమ్లా నాయక్ రైతుల నుంచి అర్జీలు స్వీకరించి స్థానిక అధికారులతో చర్చించారు. అనంతరం అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గడువు లోపు సమస్యలను పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

● సీతారామపురం: మండల పరిధిలోని బసినేనిపల్లి గ్రామ పంచాయతీలో శనివారం తహసీల్దార్ కృష్ణారెడ్డి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ కార్యనిర్వాహక అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ శ్రీనివాసులు, సర్వేయర్ భాగ్యలక్ష్మి, వీఆర్వో బాలయ్య, సచివాలయ సిబ్బంది. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

●వలేటివారిపాలెం : శామీరపాలెంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో శనివారం తహసీల్దార్ అబ్దుల్‌అమీద్ పాల్గొన్నారు. సదస్సుకు వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాయబ్‌రసూల్, ఆర్‌ఐ ప్రసాద్, మండల సర్వేయర్ గోపిరెడ్డి, ఎండోమెంట్ ఈఓ పావని వీఆర్వో మల్లేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

● మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్


కావలి టౌన్: సైన్స్ ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్లు శివప్రసాద్, నరేంద్ర

కావలి టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే శాస్త్రీయ దృక్పథం అలవల్చుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక ఓవెల్‌మినర్వా హైస్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన వెంట డాక్టర్లు శివప్రసాద్, నరేంద్రలు ఉన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టుల నమూనాల పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివయ్య, డీజీఎం శ్రీనివాసులు, ఏజీఎం జయదేవ్, హైస్కూల్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఇన్‌చార్జిలు లత, సుమలత, రమ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● సంగం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు సౌత్ ఇండియన్ సైన్స్ ఫెస్టివల్‌లో భాగంగా పాఠశాల స్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులు సైన్స్ ప్రయోగాలు ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా నెల్లూరు య్యాజియం క్యూరేటర్ సుబ్రహ్మణ్యం పాల్గొని మూడు విభాగాల్లో మూడు ప్రయోగాలను మండల స్థాయికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణితంలో రాణించాలి

సీతారామపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంగ వరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈవో మస్తాన్ వలి సందర్శించారు. విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. గణితంలో రాణించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని గ్రామ సర్పంచ్ రామచంద్రయ్యతో కలిసి పరిశీలించి వంట నిర్వాహకులకు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జన్యాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హత్య కేసు దర్యాప్తు

కలువాయి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్లకొండకు చెందిన కొల్లూరు గోపీ హత్య కేసును శనివారం రాపూరు సీఐగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎన్ సత్యనారాయణ దర్యాప్తు చేపట్టారు. గ్రామానికి వచ్చి హత్య జరిగిన ప్రదేశంతో పాటు గోపీ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఆయన విచారించారు.

ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం

బిట్రగుంట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని స్థానిక లిటిల్‌ఇంగ్లాండ్ క్రీడా మైదానంలో శనివారం న్యూఇయర్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంటును ప్రారంభించారు. మొదటిరోజు మురుగుదాసు వర్సెస్ నెల్లూరు, ఎన్‌డీఎఫ్‌ఏ నెల్లూరు వర్సెస్ శీనుమెమరీస్ జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎస్ఎస్ఈ గౌరీశంకర్, నిర్వాహకులు స్టీవెన్ కుమార్, అంథోని, అలెక్స్, చిట్టి మోహన్ నైనల్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతసాగరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిలకలమర్రి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యా యుల సహకారంతో 2025 సంవత్సర క్యాలెండర్‌ను తయారు చేశారు. అందమైన చిత్రాలతో క్యాలెండర్లను తయారు చేయడంతో చిన్నారులను హెచ్‌ఎం సురేష్, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

రేపు యూటీఎఫ్ స్వర్ణోత్సవ ప్రచారజాతా

కందుకూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం కందుకూరులో ప్రచారజాతా నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎం. తిరుపతిస్వామి, నాయకులు జి. శ్రీనివాసులు తెలిపారు. అనంతరం జనవరి 5నుంచి 8వరకు కాకినాడలో జరగనున్న స్వర్ణోత్సవ సభల విజయవంతంపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో సీ.హెచ్ వెంకటేశ్వర్లు, జీ.మాధవరావు, ఎం. మాధవరావు, ఎస్.జాలయ్య, ముప్పరాజు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి


కరటంపాడులో ఎస్‌డబ్ల్యూపీఎస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ తదితరులు

ఆత్మకూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ సూచించారు. శనివారం ఆయన ఈవోపీఆర్డీ డేవిడ్‌రాజుతో కలిసి మండలంలోని పలు చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌డబ్ల్యూపీఎస్ కేంద్రాలను సక్రమంగా నిర్వహించి, చెత్త నుంచి సంపద సృష్టించాలనే లక్ష్యంతో ఉందన్నారు. కావున సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి టైడ్ గ్రాంట్ నిధులను ఉపయోగించి ఎస్‌డబ్ల్యూపీఎస్ కేంద్రాలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనుగుంట రేవతి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుడి సన్నిధిలో ఎమ్మెల్యే ఇంటూరి


మాలకొండలో దర్శనానికి వెళ్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, డిసెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామిని శనివారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేసి శాలువాతో సత్కరించారు. అనంతరం అన్నదాన సత్రంలో భక్తులకు అందుతున్న సౌకర్యాలను భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ కందుకూరు అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మండలాధ్యక్షుడు నార్నే రోశయ్య, కాకుమాను హర్షకుమార్ ఉన్నారు.

ముగ్గురమ్మల తిరునాళ్ల వాల్‌పోస్టర్ విడుదల


వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న కాటంరెడ్డి విష్ణువర్ధన్

అల్లూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31న జరుగనున్న అల్లూరు ముగ్గురమ్మల తిరునాళ్లను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి కోరారు. శనివారం సాయంత్రం ఆయన స్థానిక నివాసంలో ఆలయ కార్యనిర్వాహకులు, గ్రామస్థులతో కలిసి తిరునాళ్ల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, గుండవరపు సుధాకర్‌రెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, పప్పు సుధాకర్, కత్తుల విజయకుమార్, పెనుమల్లి శ్రీనివాసులు రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మోమిడి మాధవరావు, పెయ్యల వెంకయ్య పాల్గొన్నారు.

సామాజిక రుగ్మతులపై అవగాహన


సంగం, డిసెంబరు 28: మండలంలోని గాంధీ జన సంఘం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సామాజిక రుగ్మతుల నియంత్రణపై ఎస్‌ఐ రాజేష్ శనివారం అవగాహన కల్పించారు. విద్యార్థినులకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై, చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రగ్గుల పంపిణీ

కందుకూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ట్రీ రిసార్ట్స్ నిర్వాహకుడు తానికొండ ప్రవీణ్ శనివారం స్థానిక సుందరయ్య నగర్‌లోని నిరుపేద చిన్నారులకు నూతన వస్త్రాలు, కోవూరురోడ్డులోని స్వర్ణ స్వయంకృషి దివ్యాంగుల పాఠశాల చిన్నారులకు రగ్గులు పంపిణీ చేశారు. తండ్రి వెంకటేశ్వర్లు జయంతి సందర్భంగా శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు చిన్నారులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు చక్కా వెంకటకేశవరావు, రవ్వా శ్రీనివాసులు, గోనుగుంట వేణుగోపాలరావు, కోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంక్రాంతికి సిమెంట్ రోడ్లు పూర్తి

● పీ రమణయ్య, పంచాయతీ రాజ్ ఏఈ, సంగం



సంగం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి: మండలంలో పల్లె పండుగ కార్యక్రమంలో చేపట్టిన సిమెంట్ రోడ్ల నిర్మాణం సంక్రాంతి నాటికి పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ పి రమణయ్య తెలిపారు.

? మండలంలో పల్లె పండుగ కార్యక్రమంలో ఎన్ని సిమెంట్ రోడ్లకు ఎన్నికోట్ల నిధులు మంజూరయ్యాయి.

! మండలంలోని 20 పంచాయతీల్లో 30 గ్రామాల్లో 30 రోడ్లకు రూ. 1.53 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వాటిల్లో ఇప్పటికే 14 పూర్తయ్యాయి. మిగిలిన 16 రోడ్లు సంక్రాంతి నాటికి పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.

? సిమెంట్ రోడ్లు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జరుగుతున్నాయా.

! నిబంధనలకు అనుగుణంగా సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ల పర్యవేక్షణలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపివేస్తామని హెచ్చరించాం.

? వైసీపీ హయాంలో చేపట్టిన సచివాలయ, రైతు భరోసా, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణాల పరిస్థితి ఏమిటీ. నిర్మాణాలు కొనసాగుతున్నాయా, లేదా.

! మండలంలో 13 సచివాలయాలకు గాను 12 చోట్ల నిర్మాణాలు ప్రారంభించారు. తరుణవాయి, వంగల్లు, జండాదిబ్బ, పడమటిపాళెంలో మాత్రమే సచివాలయ, ఆర్బీకేలు పూర్తయ్యాయి. రెండు హెల్త్ క్లీనిక్‌లు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

న్యూస్ బాక్స్

యూరియా పంపిణీ

కలువాయి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వీఆర్వో దగ్గర సీసీఆర్సీ కార్డు కానీ సాగుపత్రం కానీ తీసుకువచ్చిన కౌలు రైతులకు ఏకరాకు బస్తా వంతున యూరియా అందిస్తామని ఏవో ప్రతాప్ తెలిపారు. యూరియా కావాల్సిన రైతులు ముందుగా వ్యవసాయ సహాయకులను కలసి పేర్లు నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు.

నానో యూరియాను వాడండి

బిట్రగుంట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): యూరియాకు ప్రత్యామ్నాయంగా రైతులు ద్రవరూపంలో ఉన్న నానో యూరియాను పంటల్లో వాడాలని కావలి వ్యవసాయ సహాయ సంచాలకులు సీ.హెచ్ నాగరాజు తెలిపారు. శనివారం నాగులవరం, చెంచులక్ష్మీపురంలో ఆయన పర్యటించి వరి, వేరుశనగ పంటలను పరిశీలించి మాట్లాడారు. నానో యూరియాతో రైతులు యూరియా బస్తాలను మోసే బాధలు తప్పుతాయన్నారు. వరి పైరులో రెండోవిడత, మూడవ విడత నానో యూరియా ద్రావణాన్ని పిచికారి చేసుకుంటే ఉపయోగకరం అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి విజయలక్ష్మి, విస్తరణాధికారి అశోక్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వరిలో వెన్నుతీతపై ఆందోళన వద్దు

కలిగిరి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కలిగిరి, వింజమూరు, జలదంకి మండలాల్లో సాగుచేసిన ఆర్‌ఎన్‌ఆర్-15048, కెఎన్‌ఎం-1638 వరి రకాలకు నెలరోజు పంటలో వెన్ను రావడంపై ఆందోళన చెందవద్దని వింజమూరు ఏడీఏ రామిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన కలిగిరి సాగుచేసి వరి పంటలను స్థానిక వ్యవసాయాధికారి సురేష్ బాబుతో కలిసి పరిశీలించారు. కొన్ని రోజులుగా వీడని వర్షాలు, ముసురు వాతావరణంతో ఈ సమస్య వచ్చిందన్నారు. ఈ రకం వరిపైరులో నీరు పలుచగా ఉండి ఎకరానికి యూరియా కట్ట వేయాలని సూచించారు. ఈ జాగ్రత్తలతో పైరులో మరలా పిలకలు పుట్టుకొస్తాయన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

లింగసముద్రం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిన్నపవని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వీసీబీ పనులు నిమిత్తం ఆదివారం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ షేక్ ఫిరోజ్ శనివారం తెలిపారు. చిన్నపవని, పెద్దపవని, ముత్యాలపాడు, ముత్తంవారిపాలెం గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా ఉండదని వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

31న పింఛన్ల పంపిణీ

ఏఎస్ పేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఈనెల 31వ తేదీన పంపిణీ చేయడానికి సర్వం సిద్ధం చేశామని ఎంపీడీవో ప్రసన్నకుమారి తెలిపారు. సచివాలయ సిబ్బంది 31వ తేదీ ఉదయం 6గంటల నుంచి పెన్షన్ల పింపిణీ ప్రారంభించి సాయంత్రానికి 95శాతం పూర్తిచేస్తామని తెలిపారు.

టీడీపీ సభ్యత్వం తీసుకోండి

కందుకూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం సభ్యత్వ నమోదును ఈ నెల 30తో ముగుస్తున్నందున ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం ప్రకటనలో కోరారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి 2025 జనవరి 1నుంచి 2026 డిసెంబరు 31 వరకు ప్రమాదబీమా ఉంటుం దన్నారు.

వైసీపీ పాలనంతా భూ ఆక్రమణలే..

● ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ముత్తుకూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనంతా భూ ఆక్రమణలకు నిలయంగా మారిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం జరిగిన తాళ్లపూడి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం చేపట్టిందని, అధికారంలోకి రాగానే దుర్మార్గమైన ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి, రీ సర్వేపై జగన్మోహన్‌రెడ్డి పేర్లు, పాసు పుస్తకాలపై ఫొటోలను తొలగించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. భూ ఆక్రమణలకు పాల్పడిన వారందరూ జైలు ఊచలు లెక్కపెట్టాల్సిన పరిస్థితి రాబోతుందన్నారు. మదనపల్లి ఫైల్స్‌కు మించి అక్రమాలు సర్వేపల్లి నియోజకవర్గంలో జరిగాయని, అప్పటి ఎమ్మెల్యే అండ చూసుకుని ఇష్టారాజ్యంగా భూ అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కాకాణి పాపాలకు సొంత మండలం పొదలకూరులో ఇద్దరు తహసీల్దారులు సస్పెండ్ అయ్యారన్నారు. కాకాణి అడ్డగోలుగా కృష్ణపట్నం పోర్టు రోడ్డులో ఎకరా రూ.1.50కోట్లు విలువ చేసే 57 ఎకరాల భూమిని రూ.15 లక్షల చొప్పున అల్లుడి కంపెనీ పేరున రాసేసుకున్నాడన్నారు. ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ అమలులోకి రాగానే ప్రతి అక్రమ బాగోతాన్ని వెలుగులోకి తెస్తామన్నారు. ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు బొమ్మి సురేంద్ర, మండల అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు మల్లికార్జునయాదవ్, కోదండయ్య, జనసేన నాయకులు బొబ్బేపల్లి సురేష్ పాల్గొన్నారు.


ముత్తుకూరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

● మనుబోలు,(ఆంధ్రజ్యోతి): మండలంలోని తీరప్రాంత గ్రామాలైన కట్టువపల్లి, కొలనుకుదురు గ్రామాల్లో శనివారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ శ్రీనువాసులు, ఆర్ఐ నారాయణ, వీఆర్వో నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు సునీల్‌రెడ్డి, నిఖిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాచలం,(ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యల పరిష్కారానికే కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని సర్వేపల్లి కాలువ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు చల్లా నాగార్జున్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఈదగాలిలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు విజయ్, టీడీపీ సీనియర్ నేత కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, వీఆర్వో నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి హిమబిందు, సర్వేయర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.


వెంకటాచలం : మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

● విడవలూరు,(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా భూ వివాదాలు పరిష్కారం అవుతాయని తహసీల్దారు చంద్రశేఖర్ తెలిపారు. ముదివర్తిలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో అయన పాల్గొని ఆర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ మస్తాన్‌బాషా, రీసర్వే డీటీ విజయకుమార్, గ్రామ ఉప సర్పంచు శరత్ చంద్ర, టీడీపీ నాయకుడు రఫీ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● డాక్టర్ ఎం ప్రమీలారాజకుమారి, వేపినాపి పీహెచ్‌సీ వైద్యాధికారి



రాపూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధులు నివారించవచ్చని వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం ప్రమీల రాజకుమారి తెలిపారు.

ముఖాముఖి

? సీజనల్ వ్యాధులు ఎలా వస్తాయి.

! తాగునీరు కలుషితం వల్ల జ్వరం, జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధులతోపాటు వైరల్ ఫీవర్ వస్తాయి.

? సీజనల్ వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! పరిసరాలు, డ్రైనేజీలు, మురికిగుంతలు, నిల్వ నీటిలో లార్వాచేరకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలతో పంచాయతీ సిబ్బంది సమన్వయంతో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి శానిటేషన్ కార్యక్రమం చేపడుతున్నాం.

? దోమల నివారణకు చర్యలు చేపడుతున్నారా.

! వైద్య ఆరోగ్య, పంచాయతీల సిబ్బంది సంయుక్తంగా దోమల నివారణ చర్యలు చేపడుతున్నారు. దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

? మండలంలో హైరిస్క్ ఏరియాలు ఎన్ని ఉన్నాయి. అక్కడ ఎటువంటి వైద్య సేవలు అందిస్తున్నారు.

! మండలంలోని సిద్ధవరం, జోరేపల్లి, తదితర గ్రామాల్లో ఎక్కువగా జ్వరాలు వ్యాపిస్తున్నాయి. టైఫాయిడ్ కేసులు ఎక్కువగా నమోదు అవుతోన్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో అక్కడ ప్రత్యేక వైద్య క్యాంపులు ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.

అమిత్‌షా వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధం

● హోంమంత్రి రాజీనామా చేయాలి ● రేపు నగరంలో నిరసనలు
● వామపక్ష నేతల వెల్లడి

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధమని వామపక్ష నేతలు వెల్లడించారు. శనివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో వారు విలేఖరులతో మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్‌పై వివక్షత కోల్పోయి అమిత్ షా మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. ప్రధాని మోదీ వెంటనే ఆయన్ను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా సోమ వాం నగరం లోని గాంధీబొమ్మ నుంచి అంబేద్కర్ బొమ్మ వరకు నిరసన ర్యాలీ జరుగుతుంద న్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగాన్ని మార్చాలన్న లక్ష్యం తో పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు, నాయకులు మంగళం పుల్లయ్య, కత్తి శ్రీనివాసులు, సీపీఐ జిల్లా నేతలు షేక్ షాన్‌వాజ్, రమణయ్య, పౌరహక్కుల సంఘం నేత ఎల్లంకి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు

యూరియా కొరతను నివారించండి : బీజేపీ

నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత ఎక్కువగా ఉందని, దీంతో చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నాయకులు మిడతల రమేష్ పేర్కొన్నారు. యూరియా కొరతను నివారించాలని శనివారం ఆయన జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) సత్యవాణికి వినతిపత్రం అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ యూరియా విక్రయ కేంద్రాల్లో రికార్డులు తప్పనిసరిగా తనిఖీ చేయాలని కోరారు. రాష్ట్రంలో నిల్వలు సమృద్ధిగా ఉన్నా, జిల్లాలోని రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడడం బాధాకరమన్నారు. బయటి దుకాణాల్లో రూ.100 లు అదనంగా వెచ్చించాల్సి వస్తున్నదని చెప్పారు. పలుకుబడి కలిగిన వారు మాత్రం పెద్ద మొత్తంలో యూరియాను నిల్వ చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నీలిశెట్టి లక్ష్మణరావు, కంచర్ల నారాయణయాదవ్, కల్లు భాస్కర్ పాల్గొన్నారు.


డీఏవోకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఓవెల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన

నెల్లూరు(విద్య), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న ఓవెల్ పాఠశాలలో శనివారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు అందరినీ ఆలోచింప చేశాయి. విద్యాసంస్థల చైర్మన్ ఆర్.వేణు ప్రాజెక్టలను పరిశీలించి, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సీఈవో ప్రమీల, జీఎం మహదేవయ్య, ఈడీ బాలు, ప్రిన్సిపాల్ ఎస్‌కె.రఫీ, ఆర్.మీనాక్షి, డీజీఎం శ్రీనివాసులు, సుధాకర్, ఏజీఎం హర్షవర్ధన్, నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే డైకస్‌రోడ్డులో ఉన్న ఓవెల్ పాఠశాలలో కూడా శనివారం సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్, మ్యా థ్స్, సోషల్ విభాగాల్లో ప్రదర్శించిన ప్రాజెక్టలను పాఠశాల ప్రతినిధులు, విద్యార్థులు తిలకించారు. వాటిని తయారు చేసిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ వేణు అభినందించారు. కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ జగన్నాథలక్ష్మి, ఏజీఎం, కన్వీనర్, సిబ్బంది పాల్గొన్నారు.



సైన్స్ ప్రదర్శన ప్రారంభిస్తున్న నిర్వాహకులు

డ్రగ్స్, రౌడీయిజంపై కఠినంగా వ్యవహరించండి

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్‌డిసెంబరు 28, (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, రౌడీయిజంపై కఠినంగా వ్యవహరించాలని, అందుకు తనవంతు సహకారం అందిస్తానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని తన కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పోలీసు అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్, రౌడీయిజాలపై కఠినంగా ఉందన్నారు. తన నియోజకవర్గంలో ఇలాంటి ఆనవాళ్లు కూడా కనపడకూడదని స్పష్టం చేశారు.


పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

● టీడీపీలో చేరిక

అనంతరం మండలంలోని మాదరాజుగూడూరుకి చెందిన వైసీపీ నాయకులు తాండ్ర రమణయ్య, బుజ్జయ్య, సుధాకర్, వెంకటేశ్వర్లు వారి మిత్రబృందానికి కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు ఉమ్మడిగా గ్రామాల్లోని ప్రజా సమస్యల పరిష్కారాలకు కృషి చేయాలన్నారు.

● 'గడప గడపకు గిరిధర్'

రూరల్ నియోజకవర్గ పరిధిలోని 20వ డివిజన్ నక్కల గుంటలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి గడప గడపకు గిరిధర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయకుమార్, టీడీపీ నాయకులు సారంగం గున్నయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విజయ డెయిరీలో ఉచిత మెగా వైద్య శిబిరం

నెల్లూరు (వెంకటేశ్వరపురం) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న విజయ డెయిరీలో శనివారం రెయిన్‌బో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డెయిరీ ఎండీ పీసీ కృష్ణమోహన్ పర్యవేక్షణలో 200 మంది కార్మికులకు ఈసీజీతోపాటు షుగర్, బీపీ పరీక్షలు చేశారు. ఉచితంగా టైఫాయిడ్ వ్యాక్సినేషన్ వేశారు.ముందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు అనిల్‌చౌదరి, భగీరథ, సునీల్‌కుమార్‌తోపాటు డెయిరీ అధికారులు శ్రీనివాసరావు, రాజశేఖర్‌రెడ్డి, శివయ్య, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

● రావిచెట్టు సెంటర్‌లో...

నెల్లూరు(క్రైం,ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ కుమారుడు గునుకుల శ్రీనివాస హేమంత్ ఇటీవల డాక్టర్‌గా నియమితులయ్యారు. ఈ క్రమంలో నగరంలోని రావిచెట్టు సెంటర్ మెట్లరేవు ప్రాంతంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఈసీజీ, రక్త, షుగర్, ఇతర పరీక్షలను నిర్వహించారు. అనంతరం కిషోర్ ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు సుజయ్‌బాబు, నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, పాల్గొన్నారు.

● ఇందుకూరుపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దళితవాడలో శనివారం శ్రీవెంకటేశ్వర అగ్రికల్చరల్ కాలేజీ, జాతీయ సేవా పథకం ద్వారా ప్రొఫెసర్ డాక్టర్ విశైలజ నేతృత్వంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్స్ సి.కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో బీఎస్సీ అగ్రికల్చర్ స్టూడెంట్స్ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచు కదురు జమున ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూకటి వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ సెక్రటరీ మల్లికార్జున్‌రెడ్డి, హెచ్‌ఈవో శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు, సీహెచ్‌వో నందిని, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, అగ్రికల్చరల్, ఎన్‌ఎస్‌ఎస్ టీం లీడర్స్ హరిప్రియ, సుమియా, లాస్య, ఉషస్విని, తదితరులు పాల్గొన్నారు.

పాతూరి అన్నపూర్ణకు సత్కారం

నెల్లూరు(సాంస్కృతికం) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో శనివారం ప్రారంభమైన ప్రపంచ తెలుగు మహాసభల్లో జిల్లాకు చెందిన రచయితలు పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో వారు తమ కవితలు వినిపించారు. జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాతూరి అన్నపూర్ణ వినిపించిన కవితకు ఘన సత్కారం అందింది. డాక్టర్ అన్నపూర్ణను పలువురు సాహితీవేత్తలు, తదితరులు అభినందించారు.

డీఎస్ఆర్ జడ్పీ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్


జడ్పీ పాఠశాలలో ప్రథమస్థానంలో నిలిచిన ప్రాజెక్టులు

నెల్లూరు(విద్య), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీఎస్ఆర్ జడ్పీ పాఠశాలలో సదరన్ ఇండియా పేరుతో శనివారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రధానంగా వ్యక్తిగత విభాగంలో 9వతరగతి విద్యార్థి కే నాయబ్ రసూల్ ప్రదర్శించిన ఐవోడీ రోబోట్ ఫర్ బ్లైండ్ పర్సన్ ప్రాజెక్ట్, గ్రూపువిభాగంలో 9వతరగతి విద్యార్థులు కే బ్రహ్మనిఖిల్, కే సందీప్‌లు ప్రదర్శించిన ఎర్త్ క్వేక్ గార్డ్, ఉపాధ్యాయుల విభాగంలో స్కూల్ అసిస్టెంట్ ఎం.వరలక్ష్మి ప్రదర్శించిన రెడ్ శాండిల్ ప్రొటెక్షన్ అండ్ ప్రొడక్ట్ నమూనాలు ప్రథమస్థానంలో నిలిచి మండలస్థాయికి ఎంపికయ్యాయి. ఈ ప్రాజెక్టలను సిద్ధం చేసిన విద్యార్థులను, ఉపాధ్యాయినిని హెచ్‌ఎం పీవీకృష్ణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవదాయ శాఖ డీఈ పరిశీలన

నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయాన్ని దేవదాయ శాఖ డిప్యూటీ ఇంజనీర్ సీహెచ్ శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ, నవగ్రహ మండపం మార్పు, అన్నదాన భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. వాటి నిర్మాణాలకు అవసరమైన అంచనాలు, ఎస్టిమేట్లు వేయమని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్ రెడ్డి, ప్రధాన అర్చకులు రఘునాథశర్మ, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'గండికోట'కు సత్కారం


గండికోటకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తున్న గుండ్రా సతీష్‌కుమార్

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): విజయవాడలో శనివారం నుంచి ప్రారంభమైన 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో బుచ్చి నగర పంచాయతీ రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్‌ను భారత రక్షణ మంత్రిత్వశాఖ ముఖ్య సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి సత్కరించి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహాసభలో గండికోటను తెలుగు తపస్విగా కొనియాడారు. దీంతో ఎంఈవోలు దిలీప్‌కుమార్, పీవీ రత్నం, సహోపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.

సీఐటీయూ నాయకుల నిరసన

తోటపల్లిగూడూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరుకూరు నుంచి తోటపల్లిగూడూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో గుంత ఏర్పడితే ఇప్పటివరకు పూడ్చకపోవడం అన్యాయమని తోటపల్లిగూడూరు మండలం సీఐటీయూ నాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి మారుబోయిన రాజా మాట్లాడుతూ నరుకూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో నిత్యం వందలాది మంది వెళ్లే రహదారిలో గుంతపడి ఉండే ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని తెలిపారు. ఇకనైనా స్పందించి రోడ్డుకు ఏర్పడిన గుంతను పూర్తి చేయాలని కోరారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కోవూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం పలువురు వృద్ధులకు ఏసీసీ కన్వెన్షన్ సెంటర్ యజమాని అనపల్లి అశోక్‌రెడ్డి దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన సతీమణి సులోచనమ్మ జ్ఞాపకార్థం చలికాలంలలో వృద్ధులు చలికి గురికాకుండా ఉండేందుకు దుప్పట్లు అందించారు. అనంతరం వీరాంజ నేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఆలయ అర్చకుడు జనార్దనం నాగరాజాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజే శారు.

నేడు అగ్నికుల క్షత్రియుల సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నవాబుపేట శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 10గంటలకు అగ్నికుల క్షత్రియుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు సాదా నాగయ్య, మాజీ అధ్యక్షుడు నగరి చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉత్సాహంగా అవెన్యూస్ క్రీడా పోటీలు

నెల్లూరు(విద్య), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శనివారం అవెన్యూస్ పాఠశాల క్రీడాపోటీలు ఉత్సాహంగా జరిగాయి. డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాటాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందన్నారు. విద్య క్రీడలు సమానంగా ఉంటే విద్యార్థి జీవితంలో ఏదైనా సాధించాలనే ఆత్మవిశ్వాసాన్ని పొందుతారన్నారు. విద్యార్థులు కూడా అవకాశాలను సద్వినియోగం చేసుకుని అన్నీ రంగాల్లో రాణించాలని తెలిపారు. అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను లాంచనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కెనరాబ్యాంక్ ఏజీఎం నాగరాజు డీకేడబ్ల్యు పీడీ విజయకళ, పాఠశాల అధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షుబు దివ్యారెడ్డి, చైర్మన్ బాబునాయుడు, కరస్పాండెంట్ కృష్ణచైతన్య, డీన్ కళాకృష్ణస్వామి, హెచ్‌ఎం డాక్టర్ శ్వేతసంధ్య, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, పీఈటీలు కరిముల్లా, ప్రవీణ్, సుకృత, సిబ్బంది పాల్గొన్నారు.


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

వీధి దీపాల సమస్యలుంటే సచివాలయాల్లో చెప్పండి

నెల్లూరు(సిటీ)డిసెంబరు 28,(ఆంధ్రజ్యోతి): నగరంలో వీధిదీపాల సమస్యలుంటే స్థానిక సచివాలయాల్లో తెలియచేయాలని ఎస్‌ఎంసీ కమిషనర్ సూర్యతేజ తెలిపారు. వేదాయపాళెం ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన వీధిదీపాలను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నగరమంతా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వారు సచివాలయాల్లో తెలియ చేయవచ్చన్నారు. వెంటనే ఇంజనీరింగ్ అధికారులు రంగంలోకి దిగుతారని చెప్పారు. అనంతరం ఎస్‌ఎంసీ కార్యాలయంలో మేయర్ స్రవంతితో కలిసి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసి సేవలను కొనియాడారు. టీడీపీ నేత ఉచ్చి భువనేశ్వరప్రసాద్ కమిషనర్‌తో భేటీ అయ్యి ఏసీనగర్‌లో వాటర్ ట్యాంకును వెంటనే శుభ్రం చేయించాలని, వేపదొరువు మెయిన్ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్‌ను తొలగించాలని విజ్ఞప్తి చేశారు.


మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్

కనుల పండువగా ఆరాట్టు ఉత్సవం

నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అయ్యప్పగుడిలో శనివారం కనుల పండువగా ఆరాట్టు (చక్రస్నానం) జరిగింది. అయ్యప్పస్వామికి ఉదయం పాలభిషేకం, గణపతి హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారికి చందనాలంకారం, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, కేరళ సంప్రదాయం ప్రకారం కేరళతంత్రులు ఆరాట్టు ఉత్సవం నిర్వహించారు. గురువాయురప్పన్ మహావిష్ణువు ఆలయంలో ఉదయం ధనుర్మాసం పూజలు, తిరుప్పావై సేవాకాలం జరిగింది. సాయంత్రం స్వామి,అమ్మవార్లకు ప్రాకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ జి.శేషగిరిరావు, కార్యదర్శి కేవీ రత్నం, కోశాధికారి జీ రత్నయ్య, పాలకమండలి సభ్యులు, ఉభయకర్తలు పర్యవేక్షించారు.

మన్మోహన్ సింగ్‌కి కళానీరాజనం



నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచం మెచ్చిన మేధావి, రాజనీతిజ్ఞుడు, దార్శనీకుడు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సూక్ష్మ చిత్రశిల్పకారుడు గంధవళ్ల ఉమాశంకర్ కళానీరాజనాలు అర్పించారు. మన్మోహన్‌సింగ్ చిత్రాన్ని రావిఆకుపై చిత్రించి (కత్తిరించి) తన అభిమానాన్ని చాటుకున్నారు.

న్యూస్ బాక్స్

జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం

కోవూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా విద్యుత్ చార్జీలు పెంచిందని జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం విధించిన ట్రూ అప్ చార్జీలను మాత్రమే కూటమి ప్రభుత్వం వసూలు చేస్తోందన్నారు. కమిషన్లకు కక్కుర్తిపడి విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదేనని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఆందోళన చేసే నైతిక అర్హత వైసీపీకి లేదన్నారు.

పీహెచ్‌సీ పరిశీలన

మనుబోలు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీడీవో జలజాక్షి శుక్రవారం పరిశీలించారు. పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ఏర్పాటుపై ఆమె వైద్యులతో చర్చించారు. పీహెచ్‌సీలో ఉన్న మౌలిక వసతులు, చేయాల్సిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, వైద్యులు మోసీనా సుల్తానా, గేయపూజిత, సీహెచ్‌వో రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాసులు రెడ్డి

నెల్లూరు(క్రైం),డి సెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వేదాయపాలెం పోలీసు స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా రేంజ్ వీఆర్‌లో ఉన్న వీ శ్రీనివాసులరెడ్డిని నియమిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీచేశారు. దీంతో శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆర్ఎస్ కిషోర్‌కుమార్ రేంజ్ వీఆర్‌కు బదిలీ అయ్యారు.

టీసీజీఎస్-1694తో అధిక దిగుబడులు

విడవలూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వేరుశనగ సాగులో టీసీజీఎస్-1694 రకం విత్తనాలు అధిక దిగుబడులు వస్తాయని ఏడీఏ సుజాత తెలిపారు. రామతీర్థంలో శనివారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అమె పాల్గొని మాట్లాడుతూ 100 రోజుల్లో కోతకు వచ్చే ఈ విత్తనం చీడపీడలను తట్టుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త ప్రసన్న రాజేష్, ఏవో వెంకటకృష్ణయ్య, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే..


మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు

వెంకటాచలం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు అన్నారు. మండలంలోని గొలగమూడి సమీపంలో ఉన్న టూరిజం కళాశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు చదువు ఒక్కటే మార్చగలదన్నారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ అధికారి జీ.సుధీర్‌బాబు, సీఆర్ఎంటీ డీ మస్తానయ్య పాల్గొన్నారు.

ఎంపీడీవోకి మద్దతుగా నిరసన

విడవలూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు మండల ఎంపీడీవో జవహర్‌బాబుపై వైసీపీ నాయకులు చేసిన దాడికి నిరసనగా స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది శనివారం కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నగేష్‌కుమారి మాట్లాడుతూ జవహర్ బాబుపై దాడి చెయ్యడం హేయమైన చర్య అన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ బాధితుడిని పరామర్శించి నిందుతులపై చర్యలు తీసుకుంటామనడం హర్షనీయమన్నారు.

నిత్యాన్నదానానికి రూ.13 లక్షల విరాళం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయ నిత్యాన్నదాన పథకానికి చెన్నై విల్లివాక్కం ప్రాంతానికి చెందిన దాతలు రామిశెట్టి సురేష్, విజయలక్ష్మి దంపతులు రూ.13 లక్షలు విరాళం చెక్కు రూపంలో ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డికి అందజేశారు. కాగా గడిచిన 6 నెలల్లో నిత్యాన్నదాన పథకానికి దాతల నుంచి రూ.71 లక్షల విరాళాలు రాగా బ్యాంకులో డిపాజిట్ చేసినట్టు ఈవో శనివారం తెలిపారు.



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



వైసీపీ హయాంలో మల్లిమడుగు రిజర్వాయరు గేట్లకు గ్రీజు కూడా వేయకపోవడంతో ఇటీవల వర్షాలకు సిబ్బంది అతి కష్టమ్మీద గేట్లు ఎత్తేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యం - తుప్పుపట్టిన మల్లిమడుగు గేట్లు



2024 వెలుగు నీడలు

తొలిసగం నిర్లక్ష్యం

మలిసగం ఆశావహం



గత పదేళ్లుగా నిలిచిపోయిన బాలాజీ రిజర్వాయర్ పనులు - ఐదేళ్లుగా పెండింగులో ఉన్న ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులు

తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఈ ఏడాది తొలి సగం జిల్లా సాగునీటి రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. అదే సమయంలో మలిసగం జిల్లా ప్రజలకు ప్రత్యేకించి రైతాంగానికి ఆశావహంగా మారింది. తొలి ఆరు నెలల పాటు గడచిన నాలుగన్నరేళ్ల తరహాలోనే వైసీపీ ప్రభుత్వం సాగునీటి పథకాలను ఏమాత్రమూ పట్టించుకోలేదు. తెలుగుగంగ సహా గాలేరు-నగరి, సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ వంటి ముఖ్య పథకాలను, రిజర్వాయర్లు, చెరువుల నిర్వహణను గాలికొదిలేసింది. కనీస మరమ్మతులూ చేయలేదు. ముఖ్య ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులే తప్ప మంజూరు చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆరు నెలల్లో బడ్జెట్ కేటాయింపులతో పాటు కనీసం అభివృద్ధి, మరమ్మతు పనులకు ప్రతిపాదనలైనా వెళ్లాయి.

మల్లిమడుగు రిజర్వాయర్‌పై అలక్ష్యం

రేణిగుంట మండలం మల్లిమడుగు రిజర్వాయర్ సామర్థ్యం 0.176 టీఎంసీలు కాగా దీనికింద 3,950 ఎకరాల ఆయకట్టు ఉంది. గాలేరు-నగరి ప్రాజెక్టులో కీలకపాత్ర వహించాల్సిన ఈ రిజర్వాయర్ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురైంది. తరచూ భారీ వర్షాలకు రిజర్వాయర్ నిండుతున్నా వరద నీటిని దిగువకు పంపడంలో సమస్యలు తలెత్తుతున్నాయి. 65 ఏళ్ల నాటి ఈ నిర్మాణంలో గేట్లుగా వినియోగించే సైఫన్లు సక్రమంగా తెరుచుకోవడం లేదు. గేట్లు తుప్పుపట్టాయి. అయితే గత ఐదేళ్లలో కనీస మరమ్మతులు కూడా జరగలేదు. గత టీడీపీ ప్రభుత్వం అప్పట్లో రిజర్వాయర్ సామర్థ్యాన్ని 2.69 టీఎంసీలకు పెంచేందుకు రూ.255 కోట్లతో టెండర్లు కూడా పిలిచింది. పాతిక శాతం పనులు జరిగాక వైసీపీ ప్రభుత్వం పనులు ఆపేసింది. ఇపుడు కూటమి ప్రభుత్వం తిరిగి సామర్థ్యం పెంచేందుకు కొత్తగా ప్రతిపాదనలు పంపాలని ఆదేశించింది.

బాలాజీ, ఆల్తూరుపాడు రిజర్వాయర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

గత టీడీపీ ప్రభుత్వంలో వేగంగా మొదలైన బాలాజీ, ఆల్తూరుపాడు రిజర్వాయర్ల నిర్మాణ పనులు వైసీపీ ప్రభుత్వం రాకతో పడకేశాయి. ఇపుడు కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ కదలిక మొదలైంది. బాలాజీ రిజర్వాయర్ నిర్మాణానికి రూ.580 కోట్లు, ఆల్తూరుపాడు రిజర్వాయర్ నిర్మాణానికి రూ.550 కోట్లతో కలెక్టర్ ప్రతిపాదనలు పంపించారు. ఇందులో ఆల్తూరుపాడు రిజర్వాయర్‌కు రూ.280 కోట్లు పరిపాలనాపరమైన నిధులు మంజూరు కూడా లభించింది. దీంతో టెండర్లు పిలిచేందుకు జలవనరుల శాఖ సమాయత్తమవుతోంది. ముఖ్యంగా బాలాజీ రిజర్వాయర్ పనులు పూర్తయితే తిరుపతి, తిరుమల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

ప్రధాన ప్రాజెక్టుల పూర్తిపై చిగురిస్తున్న ఆశలు

జిల్లాలో తెలుగు గంగ, గాలేరు-నగరి వంటి ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం 2024-25 బడ్జెట్‌లో తెలుగు గంగ ప్రాజెక్టు పనులకు రూ.879.24 కోట్లు ప్రకటించింది. అందులో ఎస్ఎస్ లింక్ కెనాల్‌కు రూ.66 కోట్లు కేటాయించింది. గాలేరు నగరికి రూ.2,438.94 కోట్లు కేటాయించింది. కూటమి ప్రభుత్వం కేటాయింపులకే పరిమితం కాకుండా నిధులు మంజూరు చేస్తుందని జిల్లా ప్రజలు ఆశాభావంతో ఉన్నారు.



ఇటీవల వర్షాలకు కాళంగి గేట్ల వద్ద దెబ్బతిన్న గట్లకు మరమ్మతులు (ఫైల్ ఫొటో)

ఐదేళ్లుగా నిర్వహణకు నోచుకోని చెరువులు

జిల్లాలో మొత్తం 2,559 చెరువులున్నాయి. వాటి నిల్వ సామర్థ్యం 23.98 టీఎంసీలు. చెరువుల కింద మొత్తం 2,70,524 ఎకరాల ఆయకట్టు ఉంది. జిల్లాలో వ్యవసాయ రంగం 70 శాతానికి మించి ఈ చెరువులపైనే ఆధారపడి ఉంది. అయితే గత ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం వీటి నిర్వహణ గురించి పట్టించుకోలేదు. ఈ ఏడాది మూడు సార్లు సంభవించిన తుఫాన్లు చెరువులను మరింత దెబ్బతీశాయి. దాదాపు అన్నింటికీ మరమ్మతులు అవసరం. ముఖ్యంగా 624 చెరువులు బాగా దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతులకు రూ.200 కోట్లు అవసరం. రూ.118 కోట్లకు ప్రతిపాదనలు పెడితే నయాపైసా కూడా రాలేదు.

నాలుగు రిజర్వాయర్ల రిపేర్లకు రూ.3కోట్లు

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని కృష్ణాపురం, పెద్దేరు, బాహుదా రిజర్వాయర్లతో పాటు ఈ జిల్లాలోని కాళంగి రిజర్వాయర్‌కు కలిపి నాలుగింటికి గానూ మరమ్మతుల కోసం ఈ ఏడాది కేవలం రూ.3 కోట్లు కేటాయించారు. అందులో కాళంగికి దక్కిన నిధుల గురించి చెప్పక్కరలేదు. ప్రాధాన్యత కలిగిన నాలుగు రిజర్వాయర్ల రిపేర్లకు ఇంత స్వల్ప మొత్తంలో కేటాయింపుల పట్ల సంబంధిత ఇంజనీరింగ్ వర్గాలు సైతం ఆశ్చర్యపోతున్నాయి.

ఐదేళ్ల తర్వాత నీరు-చెట్టు బిల్లుల మంజూరు

జిల్లాలో 2014-19 నడుమ అప్పటి టీడీపీ ప్రభుత్వం నీరు-చెట్టు కార్యక్రమం కింద రూ. 650 కోట్ల అంచనాతో 5,900 పనులు మంజూరు చేసింది. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఇందులో రూ.125 కోట్ల పనులు రద్దు చేసింది. అలాగే రూ.140 కోట్ల బిల్లులు పెండింగ్ ఉంచింది. అందులో ఇపుడు కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.23 కోట్లు విడుదల చేసింది. మరో రూ.22 కోట్ల బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. త్వరలోనే ఈ బిల్లులు కూడా మంజూరు కానున్నాయి. గత ఐదేళ్లుగా హైకోర్టు దాకా వెళ్లినా బిల్లులు దక్కించుకోలేకపోయిన కాంట్రాక్టర్లు ఇపుడు ఊరట చెందుతున్నారు.

కాళంగి రిజర్వాయర్‌దీ అదే పరిస్థితి

కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 0.24 టీఎంసీలు కాగా ఆయకట్టు 4,650 ఎకరాలు. గడచిన ఐదేళ్లుగా తీవ్ర నిర్లక్ష్యానికి లోనైంది. మూడు గేట్లు పనిచేయడం లేదు. దీనివల్ల వచ్చిన నీటిని వచ్చినట్టే వదిలిపెట్టాల్సిన పరిస్థితి. ఈ ఏడాదిలో కూడా తొలి ఆరు నెలలూ నిధులు రాలేదు. ఇపుడు కూటమి ప్రభుత్వం వచ్చాక మరమ్మతులకు రూ.55 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు.

అరణియార్ నిధులను దారి మళ్లించారు!

పిచ్చాటూరు మండలంలోని అరణియార్ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 1.853 టీఎంసీలు. ఆయకట్టు 5,500 ఎకరాలు. ప్రాజెక్టు ఆధునికీకరణ కోసం రూ.35 కోట్ల జైకా నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులను గత వైసీపీ ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించడంతో పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. ఇటీవలే ప్రాజెక్టును పరిశీలించిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మళ్లీ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.



అరణియార్ ప్రాజెక్టు పనులకు మంజూరైన నిధులను వైసీపీ ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించడంతో అర్ధంతరంగా ఆగిన పనులు



వాకాడు స్వర్ణముఖి గేట్లకు శుక్రవారం చేపట్టిన మరమ్మతులు

స్వర్ణముఖి బ్యారేజీలో పనిచేయని 27 గేట్లు

వాకాడు మండలంలోని స్వర్ణముఖి బ్యారేజీ నీటి నిల్వ సామర్థ్యం 0.035 టీఎంసీలు. దీనికింద 9,022 ఎకరాల ఆయకట్టు ఉంది. భారీ వర్షాలు కురిసినప్పుడల్లా బ్యారేజీ నిండిపోయి వరద నీరు దిగువన సముద్రంలోకి విడిచిపెడుతుంటారు. మొత్తం 34 గేట్లుండగా గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో 24 గేట్లు పాడై పనిచేయడం లేదు. కేవలం ఏడు గేట్లు మాత్రమే పనిచేస్తున్నాయి. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో నిధులేమీ రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇపుడు యుద్ధప్రాతిపదికన గేట్లకు మరమ్మతులు జరుగుతున్నాయి. శుక్రవారం ఎనిమిది గేట్లను సిద్ధం చేశారు. దీంతో పనిచేయని గేట్ల సంఖ్య 27 నుంచి 19కి తగ్గింది.

చిన్నారుల కళా పండుగ

6లో

తిరుపతి బాలోత్సవం శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. చిన్నారుల్లోని సృజనాత్మకతను ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని 147 ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన 1,200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



వైకుంఠ ద్వార దర్శనానికి ఇప్పటికే 1.73 లక్షల టికెట్ల జారీ



● ఆ పది రోజులు టోకెన్లు, టికెట్లు ఉన్న వారికే అనుమతి : ఈవో

తిరుమల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి 1.40 లక్షల రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, 33 వేల శ్రీవాణి టికెట్లను ఆన్‌లైన్ ద్వారా కేటాయించామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. ఈ టికెట్లు పొందిన వారికి మహాలఘు దర్శనం ఉంటుందని స్పష్టం చేశారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం ఆయన అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి డయల్ యువర్ ఈవో కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడారు. వైకుంఠ ద్వార దర్శనానికి భక్తులు క్యూలో ఎక్కువ సమయం వేచి ఉండే అవసరం లేకుండా టైంస్లాట్ టోకెన్లు జారీ చేస్తామన్నారు. తిరుపతిలోని 8 కేంద్రాల్లో 87 కౌంటర్లు, తిరుమలలో 4 కౌంటర్ల ద్వారా స్లాటెడ్ సర్వదర్శనం(ఎస్ఎస్‌డీ) టోకెన్లు 9వ తేదీ ఉదయం 5 గంటలకు 10, 11, 12 తేదీలకు సంబంధించి టోకెన్లు జారీ చేస్తామన్నారు. తదుపరి రోజులకు ఏ రోజుకారోజు భూదేవి కాంప్లెక్స్, విష్ణు నివాసం, శ్రీనివాసంలో జారీ చేస్తామన్నారు. టోకెన్లు పొందే భక్తులు కేటాయించిన సమయానికే తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గోవిందమాల భక్తులు కూడా టోకెన్లు పొందే తిరుమలకు రావాలని సూచించారు. ఆ పది రోజులు ప్రత్యేక దర్శనాలన్నీ రద్దు చేశామన్నారు. జనవరి 7న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగుతుందన్నారు. 10న ఉదయం 9 గంటలకు స్వర్ణరథోత్సవం, 11న వేకువజాము 4.30 గంటలకు చక్రస్నానం ఉంటుందని వివరించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేస్తామని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. తిరుమలలోని జలశయాలు టీటీడీవేనని, కేవలం నిర్వహణ బాధ్యతలను మాత్రమే కేంద్ర జలవనరుల శాఖకు అప్పగించామని అన్నారు. పరకామణి దొంగతనం కేసులో టీటీడీ రాయించిన రవికుమార్‌కు సంబంధించిన ప్లాట్లు ఖాళీగా ఉన్నాయనే ప్రశ్నకు బదులిస్తూ వినియోగించే అంశంపై పరిశీలన చేస్తామన్నారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

లక్ష్మి ఇంట పండగొచ్చింది

● కువైత్ చెర నుంచి శ్రీకాళహస్తికి..

● సాయం చేసినవారికి కృతజ్ఞతలు



తిరుపతి, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి) : కువైత్‌లోని ఏజెంట్ చెరలో చిక్కుకున్న శ్రీకాళహస్తి మండలం రాజీవ్‌నగర్‌కు చెందిన ఎల్లంపల్లి లక్ష్మి స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంది. శుక్రవారం రాత్రి తన ఇంటికి చేరుకోవడంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. వారి ఇంట పండుగ వాతావరణం కనిపించింది. బిడ్డలను చదివించుకోవాలని కష్టపడి కువైత్‌కు వెళ్లి నరకకూపంలో చిక్కుకున్న ఆమె ఆవేదనకు 'ఆంధ్రజ్యోతి' అక్షర రూపమిచ్చింది. ఇండియాకు వెళ్లిపోతానంటే 'నన్ను చంపి ఎడారిలో పడేస్తామంటున్నారు' అన్న శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఎస్పీ సుబ్బరాయుడు స్పందించారు. ప్రత్యేక చొరవ తీసుకుని ఆమెకు విమాన టికెట్ సిద్ధం చేశారు. దుబాయ్‌లో ఉన్న తిరుపతికి చెందిన ఏపీఎన్ఆర్టీ మాజీ కోఆర్డినేటర్ డాక్టర్ ముక్కు తులసీకుమార్ ఆమెకు పాస్‌పోర్ట్ అందేలా కృషి చేశారు. దీంతో ఆమె శుక్రవారం ఉదయం కువైత్ నుంచి చెన్నై విమానాశ్రయానికి చేరుకున్నారు. తీవ్రమైన మానసిక ఒత్తిడితో ఉన్నట్లు కనిపించారు. ఒకరోజంతా కుటుంబ సభ్యులతో గడిపిన తర్వాత కాస్త కుదుటపడ్డారు. తన ఆవేదనను అందరికీ తెలిసేలా చేసిన 'ఆంధ్రజ్యోతి'కి, ప్రత్యేక చొరవ తీసుకున్న ఎస్పీ సుబ్బరాయుడుకు, కూటమి ప్రభుత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మా అమ్మను మళ్లీ ఇలా చూస్తామనుకోలేదని, సహకరించిన వారందరికీ పేరుపేరున రుణపడి ఉంటామని కుమార్తె సుచిత్ర అంటున్నారు.



అలిపిరి వద్ద వాహనాల రద్దీ

తిరుపతి(వైద్యం), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవులు కావడంతో శనివారం తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. అలిపిరి చెక్‌పాయింట్ వద్ద వాహనాలు బారులుతీరాయి. తిరుమలకు వెళ్లే భక్తులు గంటల తరబడి వాహనాల్లో నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. టీటీడీ విజిలెన్స్ సిబ్బంది వాహనాలను వేగంగా తనిఖీ చేసినా తిప్పలు తప్పలేదు.

అరగంటలో రైతుకు పాసుబుక్ మంజూరు

ఎర్రావారిపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అరగంటలోనే తన భూమికి సంబంధించిన పాస్‌బుక్ మంజూరు చేయడంతో ఓ రైతు ఆనందానికి అవధులు లేని వైనమిది. వివరాలు ఇవి. ఎర్రావారిపాలెం గ్రామానికి చెందిన రైతు నాగరాజనాయుడుకు రెండెకరాల భూమి ఉంది. చాలాకాలంగా భూమి పాసు పుస్తకం, టైటిల్ డీడ్ కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగేవాడు. అయినా మంజూరు చేయలేదు. ఈ నేపథ్యంలో శనివారం ఎర్రావారిపాలెంలో రెవెన్యూ సదస్సు జరిగింది. నాగరాజునాయుడు కొండంత ఆశతో సదస్సుకు వచ్చాడు. తహసీల్దారు పరమేశ్వర స్వామిని కలిశాడు. తన గోడు వివరించాడు. తన దగ్గర భూమికి సంబంధించి ఉన్న ఆధారాలను చూపించాడు. దీంతో ఆయన అక్కడే ఉన్న వీఆర్‌ఓ శ్రీరాములను, ఆర్ఐ శ్రీనివాసులను రికార్డులు పరిశీలించాలని ఆదేశించారు. ఆధారాలు సక్రమంగా ఉండడంతో అరగంటలోనే ఆన్‌లైన్‌లో రైతు నాగరాజు నాయుడు పేర భూమి వివరాలను నమోదు చేశారు. అక్కడికక్కడే 1బీని రైతుకు అందజేశారు. పాస్ పుస్తకం మంజూరు చేశారు. దీంతో ఆ రైతు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు.



నాగరాజ నాయుడికి పాస్‌బుక్ మంజూరుపత్రాన్ని అందజేస్తున్న తహసీల్దార్ పరమేశ్వర స్వామి

తిరుపతిలో డీజీపీ

కొత్త జిల్లా పోలీసు కార్యాలయ కాంప్లెక్సు పరిశీలన



నూతన పోలీసు కార్యాలయ కాంప్లెక్స్ వద్ద డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): డీజీపీ ద్వారకా తిరుమలరావు రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం సాయంత్రం కుటుంబ సమేతంగా తిరుపతికి విచ్చేశారు. విజయవాడ నుంచి రేణిగుంటలోని విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ఎస్పీ సుబ్బరాయుడు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు స్వాగతం పలికారు. అక్కడి నుంచి కారులో తిరుపతిలోని పోలీసు అతిథి గృహం వద్దకు చేరుకుని విశ్రాంతి తీసుకున్నారు. అనంతరం జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండులో రూ 6.41 కోట్లతో నిర్మిస్తున్న జిల్లా పోలీసు కార్యాలయ కాంప్లెక్సు భవనాలను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అక్కడే ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్, రిజర్వు గ్రౌండును పరిశీలించారు. సాయంత్రం 5.50 గంటలకు పోలీసు అతిథి గృహం చేరుకుని అక్కడి నుంచి తిరుమలకు బయలుదేరి వెళ్లారు. రాత్రికి అక్కడే బస చేసి ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం కానున్నారు. ఏఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, శ్రీనివాసులు ఆయన వెంట ఉన్నారు.

టీటీడీ బోర్డు సభ్యులతో ప్రత్యేక కమిటీల ఏర్పాటు

తిరుమల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. 16 కమిటీల సభ్యుల వివరాలను శనివారం జేఈవో వీరబ్రహ్మం వెల్లడిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఫైనాన్స్ కమిటీలో జాస్తి పూర్ణసాంబశివరావు, కృష్ణమూర్తి వైద్యనాథన్, సుచిత్ర ఎల్లా, ఏఫ్ఏ అండ్ సీఏవో(కన్వీనర్), కొనుగోళ్ల కమిటీలో జ్యోతుల నెహ్రూ, సదాశివరావు, ఆర్ఎన్ దర్శన్, జీఎం ప్రొక్యూర్మెంట్(కన్వీనర్), ఇంజనీరింగ్ కమిటీలో రాజశేఖర గౌడ్, శాంతారాం, ఆనంద సాయి, చీఫ్ ఇంజనీర్(కన్వీనర్), ఎస్టేట్ కమిటీలో జ్యోతుల నెహ్రూ, జంగా కృష్ణమూర్తి, రంగ సాయి, ఎస్టేట్ ఆఫీసర్ తిరుపతి(కన్వీనర్)గా ఉంటారు. అప్పీల్స్ కమిటీలో ఆర్ఎన్ దర్శన్,నరేష్‌కుమార్,అదిత్‌దేశాయ్, ఎండోమెంట్ కమిషనర్, డీఏ సెక్షన్ డిప్యూటీఈవో (కన్వీనర్), ఎడ్యుకేషన్ కమిటీలో ఎంఎస్ రాజు, పనబాక లక్ష్మి, భానుప్రకాష్‌రెడ్డి, డీఈవో(కన్వీనర్), మెడికల్ కమిటీలో నర్సిరెడ్డి, మునికోటేశ్వర రావు, సౌరబ్‌బోరా, చీఫ్ మెడికల్ ఆఫీసర్(కన్వీనర్)గా ఉంటారు. అలాగే హెచ్‌డీపీపీ, స్విమ్స్ గవర్నింగ్ కౌన్సిల్, స్విమ్స్ ఎగ్జిక్యూటివ్ బోర్డు, బర్డ్ ట్రస్టు, ఎస్వీబీసీ బోర్డు, ఆర్ట్స్ కాలేజీ, ఎస్‌జీఎస్ కాలేజీ, ఎస్వీడబ్ల్యూ డిగ్రీ, పీజీ కాలేజీ, న్యూఢిల్లీ ఎస్వీ కాలేజీలకు గవర్నింగ్ బాడీలకు సభ్యులను నియమించారు.



నిద్ర చోటెరగదు

ఆర్టీసీ బస్టాండు ముందు తిరుమల బైపాస్ రోడ్డులో భక్తుల సౌకర్యార్థం గతంలో అండర్‌పాస్ ఏర్పాటు చేశారు. అది ప్రస్తుతం ఉపయోగంలో లేదు. అండర్‌పాస్‌కు వెలుతురు కోసం డివైడర్ మధ్యలో స్లాబ్ వేయకుండా ఖాళీ పెట్టారు. పొరపాటున ఎవరూ అందులో పడిపోకుండా ఇనుపకంచె(రూఫ్) ఏర్పాటు చేశారు. ఆ స్థలమే ప్రస్తుతం బిచ్చగాళ్ల నిద్రకు స్థావరంగా మారిపోయింది. ఆ దారిన పోయే వాళ్లు దీన్ని చూసి నిద్ర చోటెరగదంటే ఇదేనేమో అని చర్చించుకుంటున్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. శనివారం త్రయోదశి కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 35వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 4,710మంది, రూ.50ప్రత్యేక దర్శనం 3,008మంది దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,002మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,347, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 383మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 388మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 122మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 26,488 అమ్ముడైనట్లు తెలిపారు.

శ్రీవారి సర్వదర్శనానికి 17 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 17 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూ కృష్ణతేజ గెస్ట్‌హౌస్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం: రూ.4.06 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,715

తలనీలాలు సమర్పించినవారు: 24,503







చిన్నారుల కళాపండుగ

తిరుపతి బాలోత్సవం ప్రారంభం

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రతిభ







తిరుపతి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో బాలోత్సవం ప్రారంభ వేదికపై నిర్వాహకులు, అతిథులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి బాలోత్సవంలో ఓ కళా ప్రపంచం ఆవిష్కృతమవుతోంది. పలు కళా విన్యాసాలకు తిరుపతి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ వేదికగా నిలుస్తోంది. ఈ వేడుక శనివారం ప్రారంభమైంది. చిన్నారుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని డీఈఓ కేవీఎన్ కుమార్ ప్రారంభించారు. సుమారు 30 రకాల పోటీల్లో, 70 విభాగాల్లో చిన్నారుల ప్రతిభాపాటవాలు అబ్బుర పరుస్తున్నాయి. 147 ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన 1,200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రారంభ కార్యక్రమంలో బాలోత్సవం వ్యవస్థాపకుడు మల్లారపు నాగార్జున, గౌరవాధ్యక్షుడు టెంకాయల దామోదరం, అధ్యక్షుడు నడ్డి నారాయణ, పారిశ్రామికవేత్త పీసీ రాయల్, ఆఫీసర్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు తమటం రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు సుంకర రెడ్డెప్ప, పయ్యావుల గురునాథం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, న్యాయ నిర్ణేతలు, కళాభిమానులు పాల్గొన్నారు.

నేడు బహుమతుల ప్రదానం

3, 4, 5 తరగతుల విద్యార్థులను సబ్ జూనియర్స్‌గా, 6, 7 తరగతుల విద్యార్థులను జూనియర్స్‌గా, 8, 9, 10 తరగతుల వారిని సీనియర్ విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నారు. న్యాయ నిర్ణేతలు పరిశీలించి విజేతల జాబితా రూపొందిస్తున్నారు. ముగింపు సభలో బహుమతులను ప్రదానం చేయనున్నారు.

స్పందన బాగుంది



పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకే బాలోత్సవం చేపడుతున్నాం. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నుంచి స్పందన బాగుంది. ఈ ఉత్సాహంతో భవిష్యత్తులోనూ తిరుపతి బాలోత్సవాన్ని నిర్వహించాలనే ఆసక్తి కలుగుతోంది.

- నడ్డి నారాయణ, తిరుపతి బాలోత్సవం అధ్యక్షుడు

భళా చిన్నారుల ప్రతిభ



బాల్యం నుంచే పిల్లలను మంచి మార్గంలో నడపడానికి బాలోత్సవం నిర్వహిస్తున్నాం. తిరుపతి, పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చి ప్రతిభను అద్భుతంగా ప్రదర్శిస్తున్నారు. చిన్నారుల ప్రతిభ అబ్బుర పరుస్తోంది.

- టెంకాయల దామోదరం, బాలోత్సవం గౌరవాధ్యక్షుడు

చిన్నారుల కళా ప్రపంచం



బాలోత్సవం చిన్నారుల కళా ప్రపంచాన్ని తలపిస్తోంది. అనేక మంది చిన్నారులు తమలోని కళలను ప్రదర్శిస్తున్నారు. ఒక టీచర్‌గా ఈ దృశ్యాన్ని పదిలంగా దాచుకొని సంబరపడుతున్నాను. పిల్లల పండుగ చూడాలని ఆసక్తిగా వచ్చాను.

- ఎన్.సత్యసుభాషిణి, టీచర్, కోదండరామస్వామి స్కూల్

దేశభక్తి పాటలు పాడా



దేశభక్తి పాటలు పాడాను. పాడుతున్నంతసేపూ తెలియని ఉద్వేగం కలిగింది. గాంధీ నుంచి భగత్‌సింగ్ వరకూ అందరినీ పాటల రూపంలో జ్ఞాపకం చేసుకోవడం గర్వంగా అనిపించింది.

- ఎ.శ్రీరసజ్ఞ, 6వ తరగతి, సిల్వర్ ఓక్స్ స్కూల్, తిరుపతి

వేమన పద్యాలతో నీతిని చాటుతున్నా



వేమన పద్యాల్లోని నీతి నన్ను చాలా ఆకట్టుకుంది. పద్యం పోటీల్లో వీటిని పాడాను. భవిష్యత్తులో వేమన పద్యాల్లోని నీతిని చాటాలనే ఆలోచన ఉంది. తెలిసిన వేమన పద్యాన్ని పాడేందుకు బాలోత్సవం వేదిక లభించింది.

- యోషితప్రియ, భాష్యం స్కూల్, తిరుపతి

ఆత్మవిశ్వాసం కలిగింది



చదరంగం (చెస్) అంటే చాలా ఇష్టం. చదరంగంలో నా ఆసక్తినీ, ప్రతిభను గుర్తించి మా స్కూల్ టీచర్స్ బాలోత్సవం పోటీలకు తీసుకొచ్చారు. ఏకాగ్రతతో చదరంగం ఆడాను. నలుగురిలో చదరంగం ఆడాననే ఆత్మవిశ్వాసం, ఆనందం కలిగింది.

- మోహిత్‌సాయి, చైతన్యభారతి స్కూల్, తిరుపతి

లేఖ రాయడం ఓ అనుభూతి



లేఖా రచన పట్ల నాలో ఆసక్తి పెరుగుతోంది. దూరంగా ఉండే ఆత్మీయులకు లేఖ రాయడంలో ఆనందం, అనుబంధం కనిపిస్తాయి. మాటల్లో చెప్పలేని ఎంతో ఆత్మీయతను లేఖ ద్వారా వ్యక్తం చేయవచ్చు.

- ఎమ్మిశెట్టి భానజీరెడ్డి, స్ప్రింగ్‌డేల్ స్కూల్, తిరుపతి

ఊహలకు రంగులద్దుతున్న చిన్నారులు



ఏ భావానికి ఏ చిత్రానికీ ఎక్కడ ఎలాంటి రంగు దిద్దాలనే విషయంలో చిన్నారులు చాలా శ్రద్ధ కనబరుస్తున్నారు. వాటర్ కలర్స్, అకర్‌లిక్స్, ఆయిల్ పెయింటింగ్, తాంజూర్ వంటి అంశాల్లో చిన్నారులు తమ ఊహలకు రంగులు అద్దుతూ ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నారు.

- జి.గాయత్రీదేవి, చిత్రలేఖనం న్యాయ నిర్ణేత

స్టేషన్‌కు వచ్చే బాధితులకు అండగా ఉండాలి

- మత్తు పదార్థాల వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపండి
- క్రైం సమీక్షా సమావేశంలో ఎస్పీ సుబ్బరాయుడు



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల పోలీసు యంత్రాంగం మర్యాదగా, స్నేహపూర్వకంగా మెలిగి వారికి అండగా నిలవాలని ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. పద్మావతి విశ్వవిద్యాలయంలోని సావేరి అతిథి గృహంలో శనివారం జిల్లా నేర సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు అధికారులు శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట వేయాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై స్పందించాలన్నారు. కేసుల పురోగతిపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని ఆదేశించారు. పండుగలు, పర్వదినాల్లో జూదం, మట్కా, కోడి పందేలు, డీజే సౌండ్లు, రికార్డింగ్ డ్యాన్స్, అశ్లీల చిత్రాలకు అనుమతి లేదన్నారు. గంజాయి, మత్తు పదార్థాల అమ్మకం, సరఫరాను అరికట్టడానికి కృషి చేయాలని కోరారు. బార్లు, మద్యం దుకాణాలు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దుకాణం, షాపింగ్ మాల్స్, అపార్టుమెంట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. చట్ట విరుద్ధంగా నిర్వహించే కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. కచ్చితమైన ఆధారాలు లేకుండా నిర్బంధించడం, శిక్షించడం వంటి చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసులు ప్రతిరోజూ తనిఖీలు చేసి లైసెన్సు లేనివారు, త్రిబుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్‌లపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, శ్రీనివాసరావు, నాగభూషణరావు, రామకృష్ణ, ఎస్పీ డీఎస్పీ గిరిధర్, సీఐ శ్రీనివాసులు, తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, వెంటకగిరి డీఎస్పీ చెంచుబాబు, అన్ని సబ్ డివిజన్ల డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

తేలిక దున్నకాలతో మామిడి పూతకు అవకాశం

- జిల్లా వ్యవసాయ వనరుల అధికారి





తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మామిడిలో మంచి పూత రావడానికి రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ వనరుల అధికారి మెరుగు భాస్కరయ్య సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదైనందున మంచి దిగుబడికి అవకాశం ఉందన్నారు. వర్షాలు తగ్గాక తోటల్లో రైతులు తేలికగా దున్నుకోవాలన్నారు. దీనివల్ల భూమిలోని తేమ ఆవిరై బెట్ట పరిస్థితి ఏర్పడి పూతరావడానికి వీలుంటుందన్నారు. తోటలో తేలిక దున్నడం వలన కలుపు మొక్కలను నివారించుకోవచ్చన్నారు. శుభ్రత పాటిస్తే చీడల బెడదను తగ్గించుకోవచ్చన్నారు. తోట దున్నిన తర్వాత చెట్లను పొటాషియం నైట్రేట్ లీటరు నీటికి 10 గ్రాములు, పార్ములా-4 సూక్ష్మ పోషకాలు మిశ్రమాన్ని లీటరు నీటికి 2-3 గ్రాములు కలిపి స్ప్రే చేయాలన్నారు. దీంతో చెట్లలో పూమొగ్గలు ఉత్తేజితమై పూత బాగా వస్తుందన్నారు.

ఎగ్జిక్యూటివ్ కోటా పీహెచ్‌డీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఎగ్జిక్యూటివ్ కోటాలో పీహెచ్‌డీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు కోరారు. దరఖాస్తుకు జనవరి 21వ తేదీ చివరి గడువుగా విధించినట్టు ఆయన తెలిపారు. పదేళ్ల ప్రభుత్వ, ప్రైవేట్, పారిశ్రామిక రంగాల్లో కార్యనిర్వాహణ అధికారిగా అనుభవం ఉన్న వారు ఇందుకు అర్హులని చెప్పారు. గ్రూప్-1 సర్వీస్ హోదాకి సమాంతర సర్వీస్ కలిగి నెలకు రూ.1 లక్ష వేతనం కలిగి ఉండాలని కోరారు. ప్రైవేట్, పారిశ్రామిక రంగాలకు చెందిన వారైతే రూ.25 కోట్ల పైగా లావాదేవీలు కలిగి ఉండాలని సూచించారు. ఇందుకు సంబంధించిన ఆడిట్ రిపోర్టును సమర్పించవలసి ఉంటుందని వివరించారు. అభ్యర్థులు కనీసం రెండేళ్ల ఆదాయ పన్ను శాఖ జమ చేసిన ఖాతాను జతపరచాలని పేర్కొన్నారు. గుర్తింపు పొందిన ప్రముఖ జర్నల్స్‌లో అభ్యర్థి పేరుతో రెండు పరిశోధనా పత్రాలు ప్రచురితమై ఉండాలని తెలియజేశారు. పార్ట్ టైం ప్రాతిపదికన పరిశోధనా కోర్సు రూపకల్పన చేసినట్టు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు యూనివర్సిటీ రీసెర్చ్ కమిటీ ఎదుట పరిశోధనాంశంపై మౌఖిక నివేదిక సమర్పించవలసి ఉంటుందని వివరించారు. సమగ్ర సమాచారం కోసం ఎస్వీయూనివర్సిటీ.ఎడ్యూ.ఇన్.. వెబ్‌సైట్ చూడాలని రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఒక ప్రకటనలో కోరారు.

ఎస్వీయూ పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షల వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. తొలుత ఈ నెల 30వ తేదీ నుంచీ పరీక్షలు నిర్వహించాలని షెడ్యూల్ ప్రకటించారు. అయితే విద్యార్థుల విన్నపం మేరకు జనవరి 3వ తేదీకి పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు వర్సిటీ పరీక్షల అధికారి దామ్లా నాయక్ తెలిపారు.



కియోస్క్ మిషన్లతో సులభంగా విరాళాలు

- **50 రోజుల్లో రూ.55 లక్షల విరాళాలు**

తిరుమల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.1 నుంచి రూ.లక్షలోపు విరాళం ఇవ్వాలనుకున్న భక్తుల కోసం తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో కియోస్క్ మిషన్లు(సెల్ఫ్ ఆపరేటెడ్ ఆన్‌లైన్ పేమెంట్) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ మిషన్ల ద్వారా అన్నప్రసాదం ట్రస్టుకు 50 రోజుల్లో రూ.55 లక్షలు విరాళంగా అందాయి. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, ఒంటిమిట్ట కోదండ రామాలయం, బెంగళూరులో శ్రీవారి ఆలయంలో కూడా ఈ మిషన్లు ప్రారంభించారు. ఈ మూడు ఆలయాల్లో 15 రోజుల్లో రూ.5 లక్షల విరాళాలు అందాయి. అలాగే శనివారం పేరూరు సమీపంలోని వకుళమాత ఆలయంలోనూ ఈ మిషన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. మరో వారం రోజుల్లో విజయవాడ, చెన్నై, హైదరాబాద్‌లోని శ్రీవారి ఆలయాల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రస్తుతం అన్నప్రసాదం ట్రస్టుకు మాత్రమే విరాళాలు ఇచ్చే అవకాశముంది. త్వరలో టీటీడీ ఆలయాల్లోని అన్ని సేవలకు ఈ మిషన్ల ద్వారా నగదు రహిత చెల్లింపు చేసే విధానాన్ని టీటీడీ అందుబాటులోకి తీసుకురానుంది.

31న పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను జిల్లాలో ఒకరోజు ముందుగానే పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ శనివారం తెలిపారు. జనవరి ఒకటి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని డిసెంబరు 31న లబ్ధిదారులకు ఇంటి వద్దనే పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో 2,63,995మంది పింఛనుదారులకు రూ.112 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. 31వ తేదీ తీసుకోలేని వారికి 2వ తేదీ ఇంటి వద్దనే పంపిణీ చేస్తారని వివరించారు. జీవిత భాగస్వామి మరణించిన వారికి ఇదేనెలలో కొత్త పింఛను మంజూరు చేస్తామని తెలిపారు.

సమన్వయంతో పక్షుల పండుగను విజయవంతం చేస్తాం

- మత్స్యశాఖ డీడీ నాగరాజు
- పడవ షికారుకు తొలగిన అడ్డంకులు



పడవల రేవును పరిశీలిస్తున్న మత్స్యశాఖ డీడీ నాగరాజు

తడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల తర్వాత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించతలపెట్టిన పక్షుల పండుగను అధికారులు, మత్స్యకారుల సమన్వయంతో విజయవంతం చేస్తామని మత్స్యశాఖ డీడీ నాగరాజు అన్నారు. శనివారం సాయంత్రం భీములవారిపాళెం పడవల రేవుకు వచ్చిన ఆయన అక్కడి పరిస్థితులను పరిశీలించారు. చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలిచ్చారు. పర్యాటకశాఖ రిసార్టులో మత్స్యకార నాయకులతో సమావేశమయ్యారు. పడవల బకాయిలు, పడవల ఏర్పాటుపై చర్చించారు. రాబోయే పండుగలో 30 పడవల ఏర్పాటుకు మత్స్యకారులు అంగీకారం తెలిపారని ఆయన మీడియాకు వెల్లడించారు. సమావేశంలో డీడీతోపాటు ఎంపీడీవో విజయకుమార్, మత్స్యకార నాయకులు బొమ్మన పళని, శ్రీధర్, సుధాకర్, ఏకాంబరం, ప్రకాష్, ఎఫ్‌డీవో మహిజ, ఎంపీటీసీ రమేష్ పాల్గొన్నారు.

385 ద్విచక్ర వాహనాల సైలెన్సర్ల ధ్వంసం



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శబ్ద కాలుష్యం చేస్తున్న 385 ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో శనివారం ధ్వంసం చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ర్యాష్ డ్రైవింగ్, అధిక శబ్దం, హారన్ కలిగిన వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సైలెన్సర్లు మార్చే మెకానిక్‌లపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. 65 డెసిబెల్ కంటే ఎక్కువగా శబ్ద కాలుష్యం చేసే వాహనాలను ట్రాఫిక్ పోలీసులు గుర్తించారన్నారు. వారి తల్లిదండ్రులకు త్వరలో కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. కాగా, పద్మావతీ విశ్వవిద్యాలయం వద్ద హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ఎస్పీ బుల్లెట్ తోలుతూ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, వెంకట్రావు, డీఎస్పీ రామకృష్ణమాచారి, ఎస్పీ డీఎస్పీ గిరిధర్, సీఐ శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, సంజీవకుమార్, భాస్కర నాయక్, ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు 1,041 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు శనివారం 1,041 అర్జీలు అందాయి. ఇప్పటివరకు మొత్తం 13,803 అర్జీలు వచ్చాయి. శనివారం వచ్చిన అర్జీల్లో హౌస్ సైట్స్‌పై 131, అసైన్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్ 132, మీసేవ గ్రీవెన్స్(రెవెన్యూ)పై 13, క్యాస్ట్ వెరిఫికేషన్ 1, ఫాం 22ఏ 324, రీసర్వే 47, ల్యాండ్ గ్రాబింగ్ 1, ఆర్‌వోఆర్‌పై 248, ఇతర విషయాలకు సంబంధించి 138 వచ్చాయి. అందులో 114 అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించారు.

తిరుపతి-హజరత్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు కోచ్‌లు

తిరుపతి(ఆటోనగర్)డిసెంబరు28(ఆంధ్రజ్యోతి) : తిరుపతి-హజరత్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు కోచ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జనవరి నుంచి 31వ తేదీ వరకు ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్ల (12707-12708-12793-12794)కు రెండు సాధారణ, స్లీపర్ కోచ్‌లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

జూనియర్ లైన్‌మెన్ చేతివాటం రూ.2 లక్షల నగదుతో పరార్

కోట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోట సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్ అలియాస్ చంద్ర విద్యుత్ బిల్లులు వసూలు చేసిన నగదుతో పరారైనట్లు ట్రాన్స్‌కో ఏఈ తేజ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చంద్రశేఖర్ గత నెలలో కోట పట్టణంలో విద్యుత్ బిల్లులు వసూలు చేశారని, వినియోగదారుల నుంచి ఆయన నంబరుకురూ.2 లక్షల వరకు ఫోన్‌పే చేయించుకొని ట్రాన్స్‌కో కార్యాలయంలో జమ చేయకుండా అజ్ఞాతంలో వెళ్లిపోయడని పేర్కొన్నారు. కాగా, ఈనెల 21వ తేదీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా విధులకు హాజరుకానందుకు చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేసినట్లు ఏడీఈ చిన్నయ్య తెలిపారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ప్రజలకు ఉపయోగకరంగా ట్రయాంగిల్ యాప్


సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ రవీంద్ర, కమిషనర్ వెంకటేశ్వర్లు

గూడూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా సర్వీస్ ప్రొవైడర్లు, వినియోగదారులకు మధ్య అనుసంధానంగా ట్రయాంగిల్ యాప్‌ను తీసుకురావడం జరిగిందని మెప్మా పీడీ రవీంద్ర అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సర్వీస్ ప్రొవైడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లోని ఏసీ, టీవీ తదితర సమస్యలు తలెత్తినప్పుడు ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, ఇతర మెకానిక్‌ల కోసం ఇబ్బంది పడకుండా ట్రయాంగిల్ యాప్‌ను వినియోగించుకోవచ్చునన్నారు. వివిధ రకాల సర్వీస్ ప్రొవైడర్లు తమ పేర్లను ట్రయాంగిల్ యాప్‌లో నమోదు చేసుకోవడం ద్వారా ప్రజలు వారిని సంప్రదించే వీలుంటుందన్నారు. ప్రధానంగా బ్యూటీషియన్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, ఏసీ మెకానిక్, వాషింగ్ మిషన్ మెకానిక్‌లను ఎన్ఎస్‌డీసీ ద్వారా శిక్షణ ఇప్పించి సర్వీస్ ప్రొవైడర్లుగా పనులు కల్పించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పెంచలయ్య, చందన, ప్రమీల, లత తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు, టీడీపీ నేత చంద్రారెడ్డి

డక్కిలి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రీసర్వేతో తలెత్తిన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి ప్రజల ఆస్తులకు భద్రత కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నాయకుడు చంద్రారెడ్డి అన్నారు. శనివారం డక్కిలిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ వైసీపీ భూ బకాసురల ఆక్రమణల చెర నుంచి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు విముక్తి కల్పించేందకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రెవెన్యూ సదస్సులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలతో పాటు పాసుబుక్కుల్లో మార్పులు, చేర్పులపై ప్రజల నుంచి 26 అర్జీలు స్వీకరించామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాల విద్యా కమిటీ చైర్మన్ సర్వేపల్లి రత్నయ్య, ఎస్సీసెల్ అధ్యక్షుడు మచ్చల వేణు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, ఆర్ఐ ప్రియాంక, ఏఎస్‌వో వెంకటయ్య పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేని వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో వెంకటరమణ

కోట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేని వేగవంతం చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణ కోరారు. కోట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులకు స్వామిత్వ సర్వేపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ మండలాల వారీగా గ్రామాల్లో ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం మండలాల వారీగా సమీక్షించారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఎంపీడీవోలు వేణు, మనోహర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి సభ్యత్వం: బీజేపీ


నరసింహులును సత్కరిస్తున్న దయాకర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, మురళి

పెళ్లకూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల పట్ల ఆకర్షితులవుతున్న ప్రజలు క్షేత్రస్థాయిలో పార్టీని ఆదరిస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తాళ్వాయిపాడులో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి అధ్యక్షతన మండలాధ్యక్షుడి ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల సభ్యత్వాలు చేయాలని అధిష్టానం లక్ష్యం నిర్దేశించగా నిర్ణయించిందన్నారు. పార్టీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని లక్ష్యాన్ని మించి 26 లక్షలు సభ్యత్వాలు చేయడం అభినందనీయమన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సభ్యత్వ నమోదులో పెళ్లకూరు మండలం రెండో స్థానంలో ఉందన్నారు. దీని కోసం శ్రమించిన నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడిగా అక్కగారిపేటకు చెందిన కలిచేటి నరసింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎస్ఎంసీ కమిటీలకు శిక్షణ

నాయుడుపేట టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం డివిజన్ స్థాయిలో ఎస్ఎంసీ కమిటీలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గూడూరు డివిజన్‌లోని 8 మండలాలు, సూళ్లూరుపేట డివిజన్‌లోని 8 మండలాల నుంచి ఒక ప్రధానోపాధ్యాయుడు, ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక ఎస్ఎంసీ సభ్యుడు పాల్గొన్నారు. పాఠశాలలను ఎలా అభివృద్ధి చేయాలన్న అంశాలపై రిసోర్స్ పర్సన్లు వివరించారు. జనవరి 2న మండలాల్లో ఉపాధ్యాయులకు, ఎస్ఎంసీ సభ్యులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో సారధి, అసిస్టెంట్ సీఎంవో రాము, ఎంఈవో మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

గూడూరు అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒలంపియాడ్ పరీక్షల్లో స్థానిక శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభచాటినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ లెవెల్-1 పరీక్షల్లో తమ పాఠశాలకు చెందిన 338మంది విద్యార్థులు ప్రతిభచాటి లెవెల్-2కు అర్హత సాధించారన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, శ్రీహరిబాబు, హరిబ్రహ్మ, చందన, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.


ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభచాటిన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

కస్టమర్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్పీడీసీఎల్ కస్టమర్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ఆశాఖ ఈఈ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆదివారం సెలవుదినం అయినప్పటికీ విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు తెరచి ఉంటాయని, వినియోగదారులు బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు

సూళ్లూరుపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రిన్సిపాల్ శంకర్‌శర్మ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ధనుంజయరెడ్డి, కమ్మిరెడ్డి, పతిమ, శివప్రసాద్‌రెడ్డి, లీలాకుమార్, ఉష తదితరులు పాల్గొన్నారు.

క్వారీ అనుమతులను రద్దు చేయండి

ఓజిలి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం ఆరిమేనిపాడులో క్వారీ అనుమతులను రద్దుచేయాలని ఆ గ్రామస్తులు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, ఆర్డీవో కిరణ్మయికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆరిమేనిపాడులో రెవెన్యూ సదస్సు జరిగింది. గ్రామ సమీపంలో క్వారీ నిర్వహణ వల్ల ఎదురయ్యే సమస్యలను వివరిస్తూ ఎమ్మెల్యే, ఆర్డీవోకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడ క్వారీకి అనుమతులు ఇచ్చారని, దీనిని పూర్తిగా పరిశీలించి సంబంధిత శాఖ మంత్రి, అధికారులతో పాటు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ ఎంపీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో గ్రామస్తుల ప్రమేయం లేకుండా ఎక్కడో ఉన్న కొందరితో సంతకాలు చేయించి క్వారీకి అనుమతులు పొందారని అన్నారు. గ్రామస్తులు వ్యతిరేకిస్తున్న కారణంగా క్వారీలో ఎలాంటి పనులు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. సమావేశంలో తహసీల్దారు పద్మావతి, టీడీపీ మండల కన్వీనరు విజయకుమార్ నాయుడు, ధనుంజయరెడ్డి, వెంకటసుబ్బరాజు, రవీంద్రారెడ్డి, కొండూరు ఈశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన మాజీ ఎంపీ నెలవల, ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దారు పద్మావతి, టీడీపీ కన్వీనరు విజయకుమార్ నాయుడు తదితరులు

విద్యుత్ చార్జీల పెంపు పాపం వైసీపీదే: పాశిం

గూడూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై ఆర్థికభారం మోపిన పాపం గత వైసీపీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం తగ ఐదేళ్లల్లో 9 సార్లు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై లక్షల కోట్లు భారాన్ని మోపడమే కాకుండా విద్యుత్ సంస్థను నష్టాల ఊబిలోకి తీసుకువెళ్లిందన్నారు. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వమే విద్యుత్‌చార్జీలు పెంచిందని వైసీపీ నాయకులు గగ్గోలు పెడుతూ, ప్రజలను మభ్యపెట్టేందుకు ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రజలకు వాస్తవాలు తెలుసు కాబట్టే వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మలేదన్నారు. గత టీడీపీ హయాంలో అప్పటి సీఎం చంద్రబాబు నేతృత్వంలో 20వేల మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం వల్లే రైతులకు, పేద వర్గాలకు ఉచిత విద్యుత్‌ను వైసీపీ ప్రభుత్వం ఇవ్వగలిగిందని గుర్తుంచుకోవాలన్నారు. వైసీపీ పాలనలో గూడూరు నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ పథకంలో రూ.20కోట్లు, వాకాడు మండలంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనుల్లో అవినీతి జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, కరుణాకర్‌రెడ్డి, జలీల్ ఆహ్మద్, ప్రణీత్, వేముల సునీల్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, పక్కన టీడీపీ నేతలు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, కరుణాకర్‌రెడ్డి, జలీల్, ప్రణీత్


కోట, వాకాడు మండల పరిషత్ కార్యాలయాల ఎదుట నిరసన తెలియజేస్తున్న ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు

ఎంపీడీవోపై దాడి అమానుషం

కోట, వాకాడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవోపై వైసీపీ నాయకుడు దాడి చేయడం అమానుషమని, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవో వెంకటరమణ డిమాండ్ చేశారు. శనివారం కోట మండల పరిషత్ కార్యాలయం ఎదుట కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు ఆందోళన చేపట్టారు. ఉద్యోగులంతా నల్లబ్యాడ్జీలు ధరించి న్యాయాన్ని రక్షించండి, రౌడీయిజాన్ని శిక్షించాలంటూ నినాదాలు చేశారు. వాకాడు ఎంపీడీవో అన్నపూర్ణరావు ఆధ్వర్యంలో సిబ్బంది నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అన్నపూర్ణరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, ఏపీఎం మాధవి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

తడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని యువకుడు లాక్కెళ్లాడు. స్థానిక బోడిలింగాలపాడుకు చెందిన చీకోల్లు లక్ష్మి నిప్పో పరిశ్రమకు ఎదురుగా కిరాణా దుకాణం నడుపుతోంది. శనివారం మధ్యాహ్నం ఓ యువకుడు బైక్‌పై వచ్చి వాటర్‌బాటిల్ కావాలని అడిగాడు. వాటర్ బాటల్ ఇచ్చేందుకు వెనుతిరిగిన లక్ష్మి మెడలోని బంగారు గొలుసును ఆ యువకుడు తెంపుకొని పరారయ్యాడు. ఖంగుతిన్న మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడు సవర్ల బంగారు గొలుసు చోరీకి గురైనట్లుగా ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

పెళ్లకూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో అందే వినతులను సత్వరమే పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ ద్వారకనాథ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొత్తూరులో రెవెన్యూ సదస్సు జరిగింది. భూ సమస్యలుపై అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, శాఖమూరి కృష్ణమనాయుడు, మాడుపూరు మురళీ నాయుడు, పసుపులేటి రవినాయుడు, సురేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వండి

దొరవారిసత్రం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలుగా తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలంటూ దొరవారిసత్రం మండలం తనియాలి గిరిజనులు డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం జెండాలతో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో తనియాలి గ్రామ సచివాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. సర్వే నెంబరు 1లో 50 ఎకరాలు సాగు చేసుకుంటున్నామని, ఆ భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండు చేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ


పేదలకు దుప్పట్లు అందజేస్తున్న రోటరీ వెస్ట్‌క్లబ్ సభ్యులు

గూడూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక శారదనగర్ సమీపంలోని గిరిజనకాలనీలో శనివారం రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ సీనియర్ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్ రావు మాట్లాడుతూ చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని పేదలకు దుప్పట్లను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాశిన నాగులు, గిరిబాబు, బొమ్మిడి శ్రీనివాసులు, రవీంద్రారెడ్డి, శివశంకర్, ఉమామహేష్, సుమా తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో అభివృద్ధి పనులు

సూళ్లూరుపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయం సమీంపలోని ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి తన సొంత నిధులతో ఆలయ అభివృద్ధి పనులను చేయిస్తూ కొత్త హంగులు తెస్తున్నారు. ఆలయం చుట్టూ రంగులు వేసి, వెలుపల ఫ్లోరింగ్, ధ్వజ స్తంభానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీటి వసతితో పాటు గదుల నిర్మాణం కూడా చేపతామని వేనాటి తెలిపారు.

జేవీవీ ఆధ్వర్యంలో అన్నదానం

గూడూరు అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో శనివారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పురుషోత్తమరావు దాతృత్వంతో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జేవీవీ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచు నారాయణ, విశాలాక్షి, రాధమ్మ, విజయబాబు, ప్రభాకర్, ఇబ్రహీం, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి


కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న జడ్జి అనూష

వెంకటగిరి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని వెంకటగిరి కోర్టు న్యాయమూర్తి అనూష పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా శనివారం ఆమె కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ చెట్లు నరికి వేయడం వల్ల మానవాళి మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గాంధీ, రాజారావు, హరినాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవో రవికృష్ణ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు

చిల్లకూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ క్యాలెండర్‌ను ఈవో రవికృష్ణ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు శనివారం ఆవిష్కరించారు. అదేవిధంగా స్వామివారికి ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు పల్లకీసేవ జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో యరటపల్లి జానకిరామిరెడ్డి, శ్రీనివాసులు, సుబ్రమణ్యం, రామచంద్ర, వేదపండితుడు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణమ్మ

చిల్లకూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వెంకటరమణమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, కాలం చెల్లిన తీగలతో ఇబ్బందులు పడుతున్నారని, వీధిలైట్లు పగలు కూడా వెలుగుతున్నాయని, రోడ్లు అధ్వానంగా ఉన్నాయంటూ పలు సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ వెంకటరమణమ్మ, ఎంపీడీవో గోపి తెలిపారు. కార్యక్రమంలో ఏవో రామమోహన్‌రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గూడూరు పట్టణాన్ని కమ్మేసిన పొగమంచు

గూడూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని శనివారం పొగమంచు కమ్మేసింది. ఉదయం 8 గంటల వరకు పొగమంచు ఆవరించింది. ఇటీవల బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా గత మూడు రోజులుగా వాతావరణం మేఘావృతమై చిరుజల్లులు కురిశాయి. శనివారం ఉదయం పొగమంచు కమ్మేయడంతో వాహనదారులు లైట్ల వెలుగులో రాకపోకలు సాగించాల్సివచ్చింది.

రాత్రి భత్యంపై ఆర్టీసీ సిబ్బంది హర్షం

వెంకటగిరి టౌన్, డిసెంబరు 28: ఆర్టీసీ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. రాత్రి వేళల్లో విధులకు వెళ్లే సిబ్బందికి మార్చి నుంచి నిలిచిపోయిన రాత్రి భత్యాన్ని పునరుద్ధరిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ భత్యం రద్దయిన నాటి నుంచి ఉద్యోగ సంఘాలు దశల వారీగా పోరాటాలు చేస్తున్నాయి. ఉద్యోగుల ఆవేదనను గుర్తించిన ప్రభుత్వం తాజాగా భత్యం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. రాత్రి విధులంటే అసహనంతో ఉన్న సిబ్బంది తాజా పరిణామంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో వెంకటగిరి, రాపూరు డిపోలు ఉన్నాయి. వీటిలో వెంకటగిరి నుంచి 72 సర్వీసులకు 340 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. అదే విధంగా రాపూరు డిపో పరిధిలో 45 సర్వీసులు ఉండగా 201 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. రాపూరు డిపో నుంచి బెంగళూరు, హైదరాబాదు, విజయవాడ ప్రాంతాలకు వెళ్తున్నాయి. వారు సుమారు వెంకటగిరి నుంచి 45 మంది, రాపూరు నుంచి 28 మంది రాత్రి వేళ విధులకు వెళ్తుంటారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నెల వారీ జీతంతో పాటు రాత్రి విధులకు వెళ్లిన రోజున రూ. 150 చొప్పున అదనంగా అందనుంది. తాజా ఉత్తర్వులతో రాత్రి విధులకు వెళ్లే సిబ్బందికి నెలకు రూ.2వేలు అదనంగా ప్రభుత్వం అందజేస్తుంది.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు


రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ బాలకృష్ణనాయక్

గూడూరు అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ అన్నారు. శనివారం స్థానిక బనిగీసాహెబ్‌పేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కొంతమంది సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలిసిందని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ బాలకృష్ణ నాయక్ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

పక్షుల పండుగ ఏర్పాట్ల పరిశీలన


నేలపట్టులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘువేంద్ర మీనా

దొరవారిసత్రం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని శనివారం గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా పరిశీలించారు. నేలపట్టు, పులికాట్ పక్షుల రక్షిత కేంద్రాల్లో జనవరి 17, 18, 19 తేదీల్లో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పరిశీలించారు. గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, స్థానిక మండల అధికారులు, అటవీశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మూడు రోజులూ ఫెస్టివల్‌కు వచ్చే సందర్శకుల కోసం చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. సమావేశంలో స్థానిక తహసీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, నేలపట్టు ఎఫ్ఆర్వో సౌజన్య ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ భూములకు రక్షణ కల్పించండి

కోట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు పంచాయతీ వజ్జవారిపాళెంలోని సర్వే నెంబరు 18లో ఉన్న పంచాయతీ భూములకు రక్షణ కల్పించాలంటూ ఆ గ్రామస్తులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. శనివారం చిట్టేడులో రెవెన్యూ సదస్సు జరిగింది. ఖాళీగా ఉన్న భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు. అనంతరం టీడీపీ నాయకులు చంద్రశేఖర్, యాకశిరి చిన్నయ్య పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సదస్సులో మొత్తం 48అర్జీలు అందినట్లు తహసీల్దారు జయజయరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సుబ్రహ్మణ్యం, చిరంజీవి, ఆర్ఐ మధులత, సర్వేయర్ గోపీరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి

గూడూరు అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక బజారువీధిలోని ఆర్యవైశ్య సంఘ గౌరవాధ్యక్షుడు సోమిశెట్టి చెంచురామయ్య నివాసంలో ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆర్యవైశ్యులు కూటమి ప్రభుత్వం విజయానికి కృషి చేశారని, వారికి అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, చెంచురామయ్య, అబ్దుల్‌రహీం పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా రాజశేఖరరెడ్డి

నాయుడుపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయుడుపేట పట్టణ అధ్యక్షుడుగా పాపారెడ్డి రాజశేఖరరెడ్డి రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, అమరావతి రామయ్య, చిగురాకుల సురేంద్రబాబు, ఆశ చెంచుకృష్ణయ్య, పుట్టు వీరయ్య, కొప్పోలు సుబ్రహ్మణ్యం, కోటేశ్వరరావు తదితరులు అభినందించారు.


రాజశేఖర్‌రెడ్డిని అభినందిస్తున్న దయాకర్‌రెడ్డి, చంద్రప్ప, రామయ్య, చంద్రారెడ్డి తదితరులు